ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 18 జూన్ 2025 | 5

పేదరికంతో ఏ ఒక్కరి
చదువూ ఆగకూడదు
- సీఎం చంద్రబాబు ఆశయం మేరకు 63 మంది పేద పిల్లలను దత్తత తీసుకున్నా
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

6

ఈనాటికీ.. నిరాశ్రయులే!

ఎప్పటి పోలవరం ప్రాజెక్టు.. ఎక్కడ పునరావాసం.. ఎన్నో ఏళ్లయింది.. నేటికీ నిర్వాసితులు హామీలు నెరవేరక.. గూడు లేక.. గోడు వినేవారు కానరాక.. నీడ కరువై కొట్టుమిట్టాడుతున్నారు.. గత ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో ఉండి కాగితాలపై లెక్కలు తప్ప చేసిందేం లేదు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. జనం సమస్యలపై దృష్టి పెట్టింది.. ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకెళుతోంది.. గత పట్టించుకోని పనులు ప్రాధాన్యతక్రమంలో పూర్తి చేసేలా ప్రణాళిక రచిస్తోంది.. దీనిలో భాగంగానే పోలవరం పునరావాస కాలనీల మాటేంటి అనే ప్రశ్న తలెత్తింది.. అధికారుల నుంచి నివేదికలు రప్పించుకోగా 49 కాలనీలు అసంపూర్తిగా ఉన్నట్టు తెలిసింది.. ఆ వెంటనే 49 పునరావాస కాలనీల కాంట్రాక్టులు రద్దు చేసి.. మళ్లీ కొత్తగా టెండర్లు పిలిచి పనులు వేగంగా చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

6





ఉగ్రవాద అణచివేత చర్యలపై ప్రపంచ దేశాల మద్దతు
- మోదీ ప్రయోగం సత్ఫలితాలనిచ్చింది
- ఆరు దేశాల్లో 11రోజులపాటు పర్యటించాం
- వివరాలు వెల్లడించిన ఎంపీ హరీష్‌మాధుర్

ఆపసోపాలు!



ఒత్తిడిలో యంత్రాంగం

కిటకిటలాడిన పీజీఆర్ఎస్

అటు తల్లికి వందనం.. ఇటు అనర్హులకు గ్రీవెన్స్.. ఓ వైపు సచివాలయాల సిబ్బంది బదిలీలు.. మధ్యలో యోగాంధ్ర.. ఇంకోవైపు అన్నదాత సుఖీభవ.. ఇలా ముఖ్యమైన పనులన్నీ ఒకేసారి చుట్టుముట్టడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అధికారులు హైరానా పడుతూ సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు. కొందరు అర్ధరాత్రుల వరకూ సీట్లలో ఉండక తప్పని పరిస్థితి. ప్రాధాన్యతా క్రమాన్ని అనుసరించి నోడల్ అధికారులను నియమించినా.. చివరికి క్షేత్ర స్థాయిలో అన్నీ సిబ్బందిపైనే పడుతుండడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పనిచేయలేక ఆపసోపాలు పడుతున్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఉద్యోగులకు ఒత్తిడి తప్పడంలేదు.. వద్దన్నా ఉరుకులు పరుగులు పెడుతున్నారు.. రకరకాల సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి మొదటి విడత జాబితాలో లేని వారు ఉమ్మడి తూర్పులో సుమారు 1.50 లక్షల మంది ఉంటారు. కరెంటు బిల్లు ఏడాదికి సగటున 300 యూనిట్లు దాటిపోవడం, కారు ఉండడం, ఇన్‌కంట్యాక్స్ రిటర్నులు వంటి కారణాలతో అనర్హతకు గురయ్యారు. వీళ్లందరికీ ప్రభుత్వం గ్రీవెన్స్ పేరుతో ఈనెల 20వ తేదీ వరకూ సచివాలయాల్లో తమ గోడు వినిపించుకునే అవకాశం కల్పించింది. అంటే ఇక మిగిలింది కేవలం రెండు రోజులే.. ఈ నేపథ్యంలో ఆయా కార్యాలయాల వద్ద ప్రతిరోజూ వేల సంఖ్యలో జనం క్యూ కడుతున్నారు. తల్లికి వందనం సొమ్ములకు పాట్లు పడుతున్నారు. తల్లికి వందనం వినతులు సచివాలయాల్లో అప్‌లోడ్ చేయించాలి.. సందట్లో సడేమియా అన్నట్టు సచివాలయ సిబ్బంది బదిలీలను తెరపైకి తెచ్చారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 12 వేల మంది సచివాలయ సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం సచివాలయాలకు వెళ్లినా బదిలీ మూడ్‌లో ఉన్న సిబ్బంది సమాధానం చెప్పేందుకు ఇష్టపడడం లేదు. దీంతో జనం గొడవపడుతున్నారు. మరోవైపు అన్నదాత సుఖీభవ జాబితాలు సిద్ధం కావాల్సి ఉంది. ఈనెల 20వ తేదీనే సాయం విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ సమయంలో సచివాలయ సిబ్బందిని బదిలీ చేయడమంటే సాహసమనే చెప్పాలి.

21న యోగాంధ్ర...

ఈనెల 21వ తేదీన యోగాంధ్రను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని జేసీ స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటన కూడా యోగాంధ్రను పురస్కరించుకునే చేస్తున్నారు. అంతటి ప్రాధాన్యం ఉండడంతో 25 రోజులుగా అధికారులు ఉరుకులు.. పరుగులు పెడుతున్నారు. ప్రతి రోజూ సామూహిక యోగా సాధన, రెండు రోజుల కిందట ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. జిల్లాల్లోని ఏర్పాట్లు ఓ ఎత్తయితే విశాఖపట్నానికి సుమారు వెయ్యి బస్సుల వరకూ పంపించాలనే ఆదేశాలున్నాయి. తూర్పుగోదావరి జిల్లా నుంచే 500 బస్సులు అక్కడికి వెళ్లాల్సి ఉంది. అయితే శనివారం పాఠశాలలకు సెలవు కాకపోవడంతో ప్రైవేటు పాఠశాలల బస్సుల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులు తలపట్టుకుంటున్నారు. ప్రధాని మోదీ విశాఖపట్నం పర్యటన పురస్కరించుకుని మూడు జిల్లాల నుంచీ పెద్ద సంఖ్యలో పోలీసులు తరలి వెళ్లారు. బందో బస్తుకు ఎస్పీలతో సహా అధిక సంఖ్యలో అధికారులు, సిబ్బంది వెళ్లారు. మొత్తం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి సుమారు 700 మంది విశాఖ బందోబస్తులో ఉన్నారు. 22న ఆదివారం కావడంతో 23వ తేదీ వరకూ అందుబాటులో ఉన్న సిబ్బందితోనే జిల్లాల్లోని అన్ని డ్యూటీలూ నెట్టుకురావాల్సిన పరిస్థితి ఉంది.

- ఉద్యోగులకు ఊపిరి సలపని పని
- ఒకవైపు తల్లికి వందనం గ్రీవెన్స్
- ట్రాన్స్‌కో.. ఆర్డీవో ఆఫీస్‌ల వద్ద క్యూ
- పోస్టల్ సిబ్బందిపైనా ప్రభావం
- బ్యాంకుల్లో జనం కిటకిట
- మరోవైపు యోగాంధ్ర నిర్వహణ
- ప్రధాని బందోబస్తుకు పోలీసులు
- 20న అన్నదాత సుఖీభవ
- సచివాలయ ఉద్యోగుల బదిలీలు



రాజమహేంద్రవరం పోస్టాఫీస్ వద్ద మహిళల క్యూ

పోస్టల్ సిబ్బందికీ పనే..

ఇక తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో జమచేయడం మొదలు పెట్టిన దగ్గర నుంచీ బ్యాంకులు, పోస్టాఫీసులు కిటకిటలాడుతున్నాయి. ఉదయం నుంచే భారీ క్యూలు కడుతున్నారు. అకౌంట్లో సొమ్ములు పడిన వెంటనే విత్‌డ్రా చేయడానికి జనం వెళుతున్నారు. డబ్బులు తీసుకోకపోతే వెనక్కి వెళ్లిపోతాయనే వదంతులతో జనం బ్యాంకులు, పోస్టాఫీసుల ఎదుట కిక్కిరిస్తున్నారు. రాజమండ్రి పోస్టల్ డివిజన్‌కి సంబంధించి ప్రధాన పోస్టాఫీసులో సాధారణ రోజుల్లో రోజుకు సుమారు రూ.15 లక్షల వరకూ పేమెంట్స్ ఉంటాయి. తల్లికి వందనం అమలు దగ్గర నుంచీ రోజుకు రూ.2 కోట్ల వరకూ చెల్లింపులు ఉంటున్నాయి. పోస్టాఫీసుల్లో చెస్ట్ (పెద్దఎత్తున డబ్బు నిల్వ ఉంచేది) ఉండదు. అందువల్ల పోస్టల్ డబ్బులను ఎస్‌బీఐలో ఉంచుతారు. విత్‌డ్రాలు ఒక్కసారిగా పెరగడంతో బ్యాంకుల నుంచి పోస్టాఫీసులకు పెద్దఎత్తున డబ్బు సమకూర్చడం కష్టమవుతోందని చెబుతున్నారు. ఉమ్మడి తూర్పులోని వెయ్యి వరకూ ఉన్న పోస్టాఫీసులతోపాటు కాకినాడ, అమలాపురం, రాజమండ్రి డివిజన్ల ప్రధాన పోస్టాఫీసుల్లో కూడా రద్దీ ఎక్కువగానే కనబడుతోంది. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం పోస్టల్ డివిజన్లలో చాలా మంది ఖాతాలు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కి లింక్ కాకపోవడంతో పోస్టాఫీసులపై ఇప్పుడు ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో పోస్టల్, బ్యాంకు సిబ్బందికి విధుల్లో క్షణం తీరిక ఉండడం లేదు.



300 మూలకే!

ఈ-ఆటోలనూ వదలని వైసీపీ

- రూ.12.30 కోట్లు ప్రజాధనం వృథా
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం ఫలితం
- నాణ్యత లేని వాహనాల కొనుగోలు
- కొన్న తర్వాత అవి ఎక్కడికైనా కదిలితే ఒట్టు
- పనిచేయని వాహనాలు.. అన్నీ మూలకు
- ఒక్కో ఆటో మరమ్మతుకే రూ.3.50 లక్షలు

గత ప్రభుత్వంలో ఏంచేసినా మాకేంటి? ముందు వారి జేబునిండితేనే తరువాత పని జరిగేది.. అది ఖజానాకు నష్టమైనా.. జనానికి కష్టమైనా అంతే.. ఉమ్మడి జిల్లాలో ఈ ఆటోలే అందుకు ఉదాహరణ.. ఏదైనా కొత్త వస్తువు కొంటే.. దాని లైఫ్ ఎంత ఉంటుంది. కనీసం లేదంటే.. ఎంత చెత్తగా వాడి పడేసినా రెండేళ్లు.. అటువంటిది తీసుకొచ్చిన రోజే పోయాయంటే ఏమనాలి.. అదే మరి.. ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి.. పనికిరాని ఆటోలను తెచ్చిపడేశారని. ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గ కేంద్రం పిఠాపురం మునిసిపాలిటీకి 8 ఈ ఆటోలు కేటాయించారు. ప్రస్తుతం వీటిలో ఒక్కటే పనిచేస్తోంది. ఇక్కడకు వాహనాలు వచ్చిన ఆరు నెలల్లోనే బ్యాటరీలు పూర్తిగా పాడైపోయినట్టు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కాసుల కక్కుర్తితో నాసిరకం ఈ-ఆటోలను అంటగట్టిన పైనం ఇప్పుడు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు శిరోభారంగా మారింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ఈ-చెత్త ఆటోలు మూలకు చేరాయి. కనీసం వంద కిలోమీటర్లు తిరగకుండానే అనేక వాహనాల బ్యాటరీలు పాడైపోయాయి. ప్రజాధనం రూ.12.30 కోట్లతో నిత్యం చెత్త సేకరణ, తరలింపునకు ఈ ఆటోలు కొనుగోలు చేశారు. వీటికి మరమ్మతులు చేయించాలంటే ఒక్కో ఈ ఆటోలో రెండు బ్యాటరీల మార్పునకే రూ.2 లక్షల చొప్పున ఖర్చవుతోంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు మూలనపడేశాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అవినీతికి సాక్ష్యంగా మారిన వీటి విషయంలో ఏం చేయాలనేది ప్రభుత్వం తేల్చలేకపోతోంది.

ఎంత మెక్కేశారో మరి..

ఉమ్మడి తూర్పుగోదావరిలో కార్పొరేషన్లు, మునిసిపాలిటీల పరిధిలో నిత్యం 950 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. ఈ చెత్తను రోజూ ఇంటింటా వెళ్లి సేకరించడానికి గత వైసీపీ ప్రభుత్వం 2023లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పేరుతో ఈ-ఆటోలను కొనుగోలు చేసింది. ఒక్కో ఆటో రూ.4.10 లక్షల చొప్పున కొనుగోలు చేసి మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు 2023 జూన్‌లో ప్రభుత్వం కేటాయించింది. ఒక్కో మునిసిపాలిటీకి సరాసరి 8, కాకినాడ కార్పొరేషన్‌కు 106, రాజమహేంద్రవరానికి 100, నగర పంచాయతీలకు ఏడు చొప్పున ఉమ్మడి జిల్లాకు మొత్తం 300 వరకు కేటాయించింది. అయితే ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు కేటాయించిన మొత్తం 300 వాహనాల్లో 90 శాతానికిపైగా పనిచేయడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటి వినియోగంపై దృష్టి సారించింది. పరిశీలిస్తే ఎందుకు పనిచేయవని అధికారులు తేల్చారు. ఏ వాహనం చూసినా కనీసం 500 కిలోమీటర్లు తిరగకుండానే పూర్తిగా పాడైపోయినట్టు తేల్చారు.

నాణ్యతలేని వాహనాలు..

గొల్లప్రోలు నగర పంచాయతీకి ఏడు ఈ ఆటోలు రాగా ఒక్కటీ పనిచేయడం లేదు. పెద్దాపురం, సామర్లకోట మునిసిపాలిటీలకు 16 కేటాయించగా ఒక్కటే పనిచేస్తోంది. తుని మునిసిపాలిటీకి 9 ఇవ్వగా ఒక్కటీ పనిచేయడం లేదు. కాకినాడ కార్పొరేషన్‌కు 106 కేటాయించగా సగానికిపైగా మూలనపడ్డాయి. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లోను ఇదే పరిస్థితి. మండపేట మునిసిపాలిటీకి మొత్తం 12 కేటాయించగా అన్నింటికీ సమస్యలు ఉన్నాయి. అమలాపురం మునిసిపాలిటీలోనూ వాహనాలు కదలడం లేదు. రామచంద్రపురం మునిసిపాలిటీలో 8కిగాను 5 పనిచేయడంలేదు. కొవ్వూరు, నిడదవోలులోను ఇదే పరిస్థితి. ఒకరకంగా నాణ్యత లేని ఈ-ఆటోలను ప్రభుత్వానికి కాంట్రాక్టర్ అంటగట్టినట్టు వీటిని చూస్తే ఇట్టే అర్థమైపోతోంది. మూలనపడ్డ ఈ ఆటోలను ఏం చేయాలనే దానిపై ఇటీవల ప్రభుత్వం ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల అధికారులతో నివేదికలు రప్పించింది. ఒక్కో ఈ ఆటో మరమ్మతుకు రూ.లక్ష వెరసి రూ.3.50 లక్షలకుపైగానే ఖర్చవుతుందని తెలిపారు. అన్ని వాహనాలను గాడిలో పెట్టాలంటే కోట్లలో వ్యయం అవుతుందని గుర్తించారు. ఈ మేరకు మునిసిపల్ పరిపాలనశాఖ వీటికి మరమ్మతులు చేయించాలని ఉన్నతాధికారులు సమాధానమిచ్చారు. సొంత నిధుల్లేపోవడంతో వాటిని అలా ఓ మూలనే ఉంచేశారు.



యోగాంధ్ర శిక్షణపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లాలో 4,500 ప్రాంతాల్లో నేటి నుంచి మూడు రోజులు యోగా శిక్షణ : కలెక్టర్

అమలాపురం, జూన్17(ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు యోగాసనాల శిక్షణా కార్యక్రమంలో భాగంగా కోనసీమ జిల్లావ్యాప్తంగా 4500 వేదికల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లాలోని వివిధ శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. పండుగ వాతావరణంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, ఆటస్థలాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, క్రీడా ప్రాంగణాలను ఇప్పటివరకు 4,500ను గుర్తించి శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు నమోదు ప్రక్రియ చేపట్టినట్టు తెలిపారు. యోగా అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనేవారికి ప్రశంసా పత్రాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రెండున్నర లక్షల మంది ఎన్‌రోల్మెంట్ పూర్తి చేసుకున్నారని తెలిపారు. విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి బస్సుల ద్వారా జనాన్ని తరలిస్తున్నామని తెలిపారు. ఈ సమీక్షలో డీఆర్వో రాజకుమారి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, డీఈవో షేక్ సలీంబాషా పాల్గొన్నారు. కాగా ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రొటోకాల్ ప్రకారం విజయవంతం చేయాలని జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలను కలెక్టర్ మంగళవారం ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా యోగాంధ్ర నిర్వహణ, తల్లికి వందనం కార్యక్రమాలపై మండల అధికారులకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.



ఉప్పునీటితో ఉరకలేస్తున్న ఓల్డ్ అయినాపురం డ్రెయిన్

తీరానికి తల'పోటు'

- సముద్రపు పోటుతో ఉప్పునీటి కయ్యలుగా పంట పొలాలు, కొబ్బరి తోటలు
- ఉప్పునీటి ప్రవాహవేగం పెరగడానికి భూమి 'కుంగుబాటే' కారణమా..
- రైతుల్లో ఇదే చర్చ.. చర్యలు తీసుకుంటున్నా పరిస్థితి యథాతథమే

ఉప్పలగుప్తం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కోనసీమ డ్రెయిన్లలో ఉప్పునీరు పోటెత్తడం పెనుముప్పుగా మారింది. సాధారణంగా ఏడాదికి ఒకసారి మే నెలలో కర్తరి పోటుకు సముద్ర జలాలు పోటెత్తి పొలాల్లోకి ప్రవహించడం సాధారణమే. అయితే ఈ ఏడాదంతా ఉప్పునీరు పొలాల్లోకి ఎగదన్నడం రైతులకు శాపంగా మారింది. ఉభయగోదావరి జిల్లాల్లోని మలికిపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు తోపాటు పశ్చిమగోదావరి జిల్లాలోని పలు మండలాల్లో చాలాకాలంగా రైతులు ఉప్పునీటి పోటు సమస్యను ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. అయితే ఫలితం శూన్యం. ఏటా సార్వా సాగు చేయడం, ఉప్పునీటికి బలవ్వడం అన్నదాతకు ఆనవాయితీగా మారింది. అలాగే కొబ్బరి చెట్లు చనిపోవడంతో భారీగా నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది సముద్ర జలాల పోటుపై రైతుల్లో మరింత ఆందోళన పెరిగింది. దీంతో కోనసీమ వ్యాప్తంగా నీటి వినియోగదారులు సంఘాలు ఉన్నతాధికారులను కలిసి పోటు సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. కోనసీమలో పోటు సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. కోనసీమలోని ప్రధాన మేజర్ డ్రెయిన్లలో ఒకటైన కూనవరం డ్రెయిన్‌లో ప్రస్తుతం ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. అంతకుముందు రంగరాజుకోడుతో సహా పలు డ్రెయిన్లలో మేటలు తొలగించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపడుతున్నా ప్రయోజనం లేకపోవడం గమనార్హం. సార్వా సాగుకు ఇప్పటికే జాప్యం జరిగింది. ఇప్పుడు నారుమళ్లు పోయాలంటే పొలాల్లో ఉప్పునీరు తిష్టవేసింది. అది బయటకు పోయేదెప్పుడు? నారు పోసేదెప్పుడు? నాట్లు పడేదెప్పుడు? వీటికి జవాబు దొరక్క రైతులు సందిగ్ధంలో పడ్డారు.

మంత్రిని కలిసిన నీటి సంఘాల ప్రతినిధులు

కూటమి ప్రభుత్వం రావడంతోనే రైతు సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించింది. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటుచేసింది. పదవులు స్వీకరించిన మరుసటి రోజు నుంచే నీటి సంఘాలు సాగునీరు, మురుగునీటి సమస్యలపై కసరత్తు ప్రారంభించాయి. అందులో భాగంగానే ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోనసీమలోని నీటి సంఘాల ప్రతినిధులు ఇటీవల జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును పాలకొల్లులో కలిశారు. కోనసీమ ఉప్పునీటి సమస్యపై ప్రాంతాల వారీగా విన్నవించారు. ఈ సమస్యపై మంత్రి రైతులతో విస్తృతంగా చర్చించారు. డ్రెయిన్ల ఆధునికీకరణ అనంతరం కూడా ఉప్పునీరు పొలాల్లోకి ప్రవహించడంపై ఆసక్తికర చర్చ జరిగినట్టు నీటిసంఘాల ప్రతినిధులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కోనసీమవ్యాప్తంగా భూమి దిగబడిపోతుందేమోనన్న అనుమానాన్ని రైతులు వ్యక్తంచేస్తున్నారు. పోటు సమయంలో డ్రెయిన్ల ద్వారా తన్నుకొస్తున్న ఉప్పునీరు తిరిగి పాటు సమయంలో మాత్రం నెమ్మదిగా వెనక్కు వెళ్లడం తమ సందేహానికి మూలమని చెబుతున్నారు. రైతు సంఘాల ప్రతినిధుల వ్యాఖ్యలను కొట్టిపారేయలేమని మంత్రి రామానాయుడు కూడా వ్యాఖ్యానించినట్టు సమాచారం. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దష్టిలో పెట్టి, ఉప్పునీటి పోటుకు విరుగుడు కనుక్కుందామని మంత్రి తమకు భరోసా ఇచ్చారని నీటి సంఘాల చైర్మన్లు వివరించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతు నాయకులు

ఉప్పునీటి పోటుకు శాశ్వత పరిష్కారం చూపించండి : కలెక్టర్‌కు రైతుల వినతి

ఉప్పలగుప్తం, జూన్17(ఆంధ్రజ్యోతి): కూనవరం మెయిన్ డ్రెయిన్ ద్వారా పంటపొలాల్లోకి ఉప్పునీరు పోటెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపించాలంటూ జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు ఆధ్వర్యంలో రైతులు మంగళవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కారణంగా సార్వాను వదులు కోవలసి వస్తోందన్నారు. రెండు మేజర్ డ్రెయిన్లు కలిసేచోట ఆటోమేటిక్ రెగ్యులేటరీ సిస్టమ్ ఏర్పాటుచేయాలని పలువురు రైతులు అభ్యర్థించారు.



ఉప్పునీటి సమస్యపై చర్చిస్తున్న ఎమ్మెల్యే దేవ, ఎస్ఈ గోపీనాథ్

ఉప్పునీటి సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లా : ఎమ్మెల్యే దేవ

మలికిపురం, జూన్17(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం డ్రెయిన్‌లోకి ఎగదన్నే సముద్రపు ఉప్పునీరు తిరిగి వెనక్కు వెళ్లకపోవడంతో ఆయా ప్రాంతాలన్నీ చౌడు బారిపోయాయి.. దీనివల్ల కేశనపల్లి తదితర పది గ్రామాల్లో లక్షన్నర కొబ్బరిచెట్లు చనిపోవడంతోపాటు నియోజకవర్గ పరిధిలో వరి ఆయకట్టు తగ్గిపోతోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం మండలం కేశనపల్లిలో సముద్రపు నీటి ముంపుతో జరుగుతున్న నష్టాలను పరిశీలించేందుకు ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ మంగళవారం వచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడారు. సముద్రపు పోటుతో శంకరగుప్తం డ్రెయిన్‌లోకి ముంపునీరు చేరి తిరిగి వెనక్కి మళ్లిపోయేదని, నేడు అది పొలాల్లోకి, గ్రామాల్లోకి ప్రవేశిస్తోందని, ఈ సమస్యను జలవనరులశాఖ మంత్రి రామానాయుడు, సీఎం చంద్రబాబు దృష్టికి ఇప్పటికే తీసుకువెళ్లానన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ మాట్లాడుతూ 2018లో సున్నా కిలోమీటర్ల నుంచి 8.5 కిలోమీటర్ల దాకా డ్రెడ్జింగ్ చేశామన్నారు. శంకరగుప్తం డ్రెయిన్ 22.9 కిలోమీటర్ల మేర ఉందని, రూ.9 కోట్లతో డ్రెడ్జింగ్ పని ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉందని, అనుమతులు రాగానే పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, సర్పంచ్‌లు యెనుముల నాగు, ఆకుల చినవెంకన్నాయుడు, రాపాక ఆనంద్‌కుమార్ సమస్యను వివరించారు. తర్వాత ఎమ్మెల్యే దేవ, ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్‌తో కలిసి మోటారు సైకిళ్లపై ముంపు ప్రాంతాలను, దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించారు. డ్రైనేజీ ఈఈ కిశోర్ పాల్గొన్నారు.

ఈనాటికీ.. నిరాశ్రయులే!

- పోలవరం నిరాశ్రయులపట్ల నిర్లక్ష్యం
- గత ప్రభుత్వ చర్యలతో అసంపూర్తిగా కాలనీలు
- కూటమి ప్రభుత్వంలో 'పోలవరం'పై కదలిక
- నిరాశ్రయుల కాలనీలపై ప్రత్యేక దృష్టి
- ఉభయగోదావరి జిల్లాల్లో 49 కాలనీల పనులు రద్దు
- నివేదిక ఇవ్వడంలో తీవ్ర అలసత్వం
- సెప్టెంబరు నెలాఖరుకు అప్పగించాలని ఆదేశం
- సమస్యపై నివేదిక ఇవ్వని ఐదు శాఖల అధికారులు



గోకవరం మండలం కృష్ణుడుపాలెంలోని పోలవరం నిర్వాసితుల కాలనీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మకమైన పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం తమ జీవన అలవాట్లను, సంస్కృతిని, సంప్రదాయాలను, ఇళ్లను, పొలాలను త్యాగం చేసిన నిరాశ్రయులను ఆదుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ అన్ని విధాలా నిరాశ్రయులను నిర్లక్ష్యం చేయగా, గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడానికి అధికారులను ఆదేశించింది. కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఎక్కడి సమస్య అక్కడే అన్నట్టు ఉంది.

వైసీపీ నిర్లక్ష్యంతో..

గతంలో టీడీపీ అధికారంలో ఉండగా ప్రారంభించిన కాలనీలను వైసీపీ నిర్లక్ష్యం చేయడంతో 49 కాలనీలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఆ కాలనీలపై దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం పనులు చేసే కాంట్రాక్టు సంస్థలను రద్దు చేసింది. అక్కడి పనుల పరిస్థితిపై నివేదిక ఇచ్చి.. త్వరగా టెండర్లు పిలిచి సెప్టెంబరు నెలాఖరు నాటికి కాలనీల పనులు పూర్తి చేసి నవంబరులో నిరాశ్రయులకు అప్పగించాలని స్వయానా సీఎం చంద్రబాబు ఆదేశించారు. గృహనిర్మాణ సంస్థ, పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్, ఆర్ అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంతవరకూ పనులు జరిగాయి. ప్రస్తుత పరిస్థితిపై ఆయా శాఖలే నివేదిక ఇవ్వాలి. కానీ ఇంతవరకూ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వలేదు. మరో వారమో, రెండు వారాలో పడుతుందని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం లక్ష్యం దెబ్బతింటోంది. త్యాగజీవులైన నిరాశ్రయులు కనీసం తలదాచుకోవడానికి ఇల్లు లేని పరిస్థితి నెలకొంది.

నాడు టీడీపీ ప్రభుత్వంలో వేగవంతం

2014లో అధికారంలో ఉన్న టీడీపీ అనేక పోలవరం నిరాశ్రయ కాలనీల నిర్మాణం చేపట్టి కొన్ని పూర్తి చేసిన సంగతి తెలిసింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పోలవరం నిర్వాసితుల జీవితాలతో ఆటలాడుకుంది. కాలనీల నిర్మాణాన్ని గాలికొదిలేసింది. పెండింగ్ సమస్యలు పట్టించుకోలేదు. గత ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో పనుల్లో మళ్లీ కదలిక వచ్చింది. పోలవరం ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం చంద్రబాబు పనులు వేగవంతం చేసిన సంగతి తెలిసిందే. ప్రాజెక్టు పూర్తయ్యేలోపు నిర్వాసితులకు పూర్తిస్థాయి న్యా యం చేస్తానని ప్రకటించారు. ఆ దిశగా ఆదేశాలిచ్చారు.

49 కాలనీల కాంట్రాక్టు ఒప్పందం రద్దు

49 పునరావాస కాలనీల్లో పనులు మందగించాయి. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు మందగించాయి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో అప్పటివరకూ ఉన్న పెండింగ్ బిల్లులను క్లియర్ చేసింది. ఇంకా రూ.120 కోట్ల వరకూ పెండింగ్ ఉంది. 49 కాలనీలకు సంబంధించి ఏఎస్ఆర్ జిల్లాలో 19 కాలనీలు ఉన్నాయి. అందులో 4951 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా 4130 నిర్మించారు. ఇంకా 821 ఇళ్లు నిర్మించాల్సి ఉంది. ఇప్పటివరకూ 67 శాతం మాత్రమే పనులు జరిగాయి. ఏలూరు జిల్లాలో 30 పునరావాస కాలనీలు ఉండగా అక్కడ 8987 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 7529 ఇళ్లను నిర్మించారు. ఇంకా 1458 ఇళ్లు నిర్మించాలి. ఇక్కడ 60శాతం పూర్తయింది. ప్రాజెక్టు పరిధిలోని ఉభయగోదావరి జిల్లాల్లో ప్రస్తుతం కాంట్రాక్టు రద్దయిన 49 కాలనీల్లో మొత్తం 13,938 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా 11,659 నిర్మించారు. ఇంకా 2279 నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో మౌలిక వసతులు, మంచినీటి సమస్య ఉంది. ఏఎస్ఆర్ జిల్లాలో 227 అభివృద్ధి పనులకు 134 పూర్తయ్యాయి. 45 ప్రారంభం కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయాయి. ఏలూరు జిల్లా పరిధిలో మొత్తం 507 మంజూరు కాగా 193 పూర్తయ్యాయి. 219 అసలు పునాదులు వేయలేదు. మిగతావి వివిధ దశల్లో ఆగిపోయాయి. వీటన్నింటినీ సెప్టెంబరు నాటికి పూర్తి చేసి, నవంబర్ నాటికి 6577 కుటుంబాలకు ఆయా గృహాలకు తరలించాలనే లక్ష్యంతో పనిచేయాల్సి ఉంది.. ఆయా కాలనీల్లో ఏఏ పనులు చేయాలో పూర్తి నివేదికనే అధికారులు రూపొందించలేకపోయారు. ఆయా కాలనీల నిర్మాణంలో అవకతవకలు ఏమైనా జరిగినా ఈ నివేదికలో ఇవ్వాల్సి ఉంది. మరి అధికారులు నివేదిక ఎపుడిస్తారో, టెండర్లు ఎపుడు పిలుస్తారో, పనులు ఎపుడు మొదలు పెడతారో మరి. సెప్టెంబర్ అంటే మధ్యలో రెండు నెలలు మాత్రమే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో త్యాగజీవుల పునరావాస కాలనీలు ఎప్పటికీ పూర్తవుతాయనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది.

రీహేబిటేషన్‌తోపాటు రీసెటిల్‌మెంట్

ఫేజ్-1లో మొత్తం 38,060 కుటుంబాలకు రీహేబిటేషన్‌తోపాటు రీసెటిల్‌మెంట్ చేయాల్సి ఉంది. 2024, డిసెంబర్ నాటికి 14,662 కుటుంబాలకు పునరావాసం కల్పించగా 2025 మార్చినాటికి 21,441 కుటుంబాలకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేశారు. మరో 6779 కుటుంబాలకు సంబంధించి ప్రక్రియ నడుస్తోంది. ఇంకా 16,619 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాల్సిఉంది. పనులు వేగవంతం చేయడానికి ఫేజ్-1ను ఫేజ్1ఏ, ఫేజ్ 1బీ కింద విభజించారు. ఫేజ్-1ఏలో 20,946 కుటుంబాలు ఉన్నాయి. వారికోసం ఏలూరు జిల్లా, అల్లూరి సీతారామరాజు ఏజెన్సీ జిల్లాల్లో 75కాలనీలు ప్రతిపాదించారు. నిర్వాసితుల కోరిక మేరకు పక్క జిల్లాలో కూడా కాలనీలు నిర్మిస్తున్నారు. ఉదాహరణకు దేవీపట్నం పరిధిలోని నిర్వాసితులకు తూర్పుగోదావరి జిల్లాలోని గోకవరం మండల కేంద్రంలో రెండు గ్రామాలకు చెందిన 700 కుటుంబాలు, అదే మండలంలోని కృష్ణుడిపాలెం పంచాయతీ పరిధిలో 16 గ్రామాలకు చెందిన 1067 కుటుంబాలకు కాలనీలు నిర్మిస్తున్నారు. ఇప్పటివరకూ 26 కాలనీలు పూర్తిచేశారు. 14,369 కుటుంబాలను ఆయా కాలనీలకు తరలించారు. 49 కాలనీలు నిర్మాణంలో ఉండగా 6577 కుటుంబాలను తరలించాల్సి ఉంది.

బడి గంట మోగినా.. తెరుచుకోని పాఠశాల

- అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం పరిధి ఎంసీడీ గ్రామంలో తెరుచుకోని ఎంపీయూపీ పాఠశాల
- ఉపాధ్యాయుడి బదిలీతో రోజూ వేచి చూస్తున్న విద్యార్థులు



పాఠశాలకు తాళం వేసి ఉన్న దృశ్యం



మోతుగూడెం పరిధి ఎంసీడీ క్యాంప్ గ్రామంలో తెరుచుకోని పాఠశాల వద్ద విద్యార్థులు

మోతుగూడెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇంకా కొన్నిచోట్ల బడులు తెరుచుకోలేదు. ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగాపాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఎక్కడికక్కడ తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికే విద్యామిత్ర కిట్లు సైతం ఇస్తున్నారు. కాగా, అల్లూరి జిల్లా మోతుగూడెం పరిధిలో ఉన్న ఎంసీడీ క్యాంప్ గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల నేటికీ తెరవలేదు. ఆ గ్రామానికి ఉన్నది ఒక్కటే పాఠశాల. ఇందులో 24మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా రోజూ ఉదయాన్నే పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు రాలేదని వేచి చూస్తున్నారు. మధ్యాహ్నం భోజనం పథకం మాత్రం అమలవుతోంది. పాఠశాల ఆయా శాంతికుమారి వంట చేస్తోంది. దీంతో మధ్యాహ్నం 12గంటలకు విద్యార్థులంతా వచ్చి భోజనం చేస్తున్నారు. తర్వాత మళ్లీ కాసేపు ఆడుకుని ఇంటికి వెళ్లిపోతున్నారు. ఇక్కడి ఉపాధ్యాయుడు బదిలీల్లో భాగంగా అడ్డతీగల పాఠశాలకు వెళ్లారని తెలిసింది. ఇక్కడికి ఇంకా ఉపాధ్యాయులు ఎవరూరాలేదు. ఈపాఠశాల గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉండడంతో అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకిరాలేదు. పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



మా పాఠశాలకు ఉపాధ్యాయులు కావాలి. వర్షం వస్తే పాఠశాల భవనం స్లాబ్ నుంచి నీరు కారిపోతోంది. పొద్దునే పాఠశాలకు వచ్చేసరికి ప్రహరీ లేకపోవడంవల్ల మేకలు, గేదెలు, ఆవులు బడిలో ఉంటున్నాయి. వీటివల్ల పాఠశాలంతా అధ్వానంగా మారి దోమలు వస్తున్నాయి. మా బడికి ప్రహరీ ఉంటే చదువుకోవడానికి వీలుగా ఉంటుంది.

-కిలో జానకి, నాలుగో తరగతి విద్యార్థిని

గుర్రంపేటలోను ఉపాధ్యాయుడికోసం ఎదురుచూపులు



పాఠశాలలో ఉపాధ్యాయుడి కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

వీఆర్‌పురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా వీఆర్‌పురం పరిధిలోని గుర్రంపేట గిరిజన గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయుడు రాలేదు. దీంతో అతడి రాక కోసం ఆ గ్రామ గిరిజన విద్యార్థులు ఎదురుచూస్తూ మూడు గంటల వరకు పాఠశాలలోనే ఉన్నారు. వీఆర్‌పురం మండలంలోని గుర్రంపేట గ్రామం ఒకటి నుంచి ఐదోతరగతి వరకు 30 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. మంగళవారం ఆ పాఠశాలకు ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు వచ్చి పాఠశాలలోనే కూర్చున్నారు. దీనిపై ఎంఈవో లక్ష్మీనారాయణను ఆంధ్రజ్యోతి వివరణ అడగ్గా సదరు పాఠశాల టీచర్‌కు బదిలీ అయిందన్నారు. తాత్కాలికంగా పాఠశాలకు వేరొక ఉపాధ్యాయున్ని పంపించడానికి ఎవరూ లేకపోవడంతో అక్కడి అంగన్‌వాడీ టీచర్‌ను, ఆయాను చూడమన్నామని ఆయన తెలిపారు.

ఐఐఎఫ్‌టీ నిర్మాణానికి రూ.25కోట్ల నిధులు

- కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ),జూన్ 17(ఆంధ్రజ్యోతి): యు.కొత్తపల్లి మండలం పొన్నాడ వద్ద నిర్మించనున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) క్యాంపస్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం రూ.25కోట్లు నిధులు విడుదలచేసిందని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. మూడేళ్లక్రితం ఐఐఎఫ్‌టీ మంజూరు కాగా తాత్కాలికంగా జేఎన్‌టీయూకేలో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పొన్నాడ వద్ద క్యాంపస్ నిర్మించాలని నిర్ణయించారని, గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంవల్లే నిర్మాణం ఆగిపోయిందని ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పుడు నిధులు విడుదల అవ్వడంవల్ల పనులు ప్రారంభం అవుతున్నాయన్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వ్యవసాయాధికారుల బదిలీలు

సామర్లకోట,జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పలు మండలాల వ్యవసాయాధికారులను బదిలీలు చేస్తూ రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఎస్.డిల్లీరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయాలకు ఈ మేరకు ఉత్తర్వులు అందాయి. సామర్లకోట మండలానికి వి.మురళీకృష్ణ నియమితులు కాగా ఇక్కడ ఎంఏవోగా పనిచేస్తున్న ఐ.సత్య కరప ఎంఏవోగా బదిలీఅయ్యారు. వై.రాబిన్‌సుదర్శన్‌ను తుని ఏడీఏ కార్యాలయానికి ఎంఏవోగా బదిలీ చేశారు. పి.శ్రీలక్ష్మిని కాకినాడ బీసీఎల్ కార్యాలయానికి బదిలీచేశారు. ఎస్.రఘుకుమార్ కోరుకొండ ఎంఏవోగాను, జొన్నా పుణ్యవతి కాకినాడ ఏడీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కె.సూర్యరమేష్ రాజమహేంద్రవరం ఏడీఏ కార్యాలయానికి, చింతా దుర్గావిజయకుమార్ అంబాజీపేట ఎస్టీఎల్ కార్యాలయానికి, కె.ప్రభాకర్ మండపేట ఎంఏవోగాను, ఎంఎంవీఎస్ పద్మావతిని తొండంగి ఎంఏవోగాను బదిలీచేశారు. ఎ.అచ్యుతరావును కోనసీమ జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి, వైవీ గంగాధర్‌కుమార్‌ను పిఠాపురం ఎంఏవోగాను, ఏ.గాయత్రిదేవిని రంపచోడవరం సీడ్స్ ఎంఏవోగాను బదిలీ చేశారు. ఎం.సుజాతను వై.రామవరం ఎంఏవోగాను, ఎస్.రాకేష్‌ను సఖినేటిపల్లి ఎంఏవోగాను, సీహెచ్ రమ్యప్రియాంకను మలికిపురం ఎంఏవోగాను, ఎన్.సుధామాధురిని కిర్లంపూడి ఎంఏవోగాను, పీకేవీ.లక్ష్మిని సామర్లకోట ఎస్టీఎల్ ల్యాబ్‌కు బదిలీ చేశారు. మద్దూరి వెంకటలక్ష్మిని సామర్లకోట ఎస్ఎంఏఆర్ ఫారంనకు, కేవీఎస్ రమేష్‌కుమార్‌ను రాయవరం ఎంఏవోగాను, సబ్బతి నరసింహాన్ని జగ్గంపేట ఎంఏవోగాను, బోదూరి మీనాను ఆలమూరు ఎంఏవోగాను, ఎన్‌వీవీ సత్యనారాయణను మామిడికుదురు ఎంఏవోగాను, కె.ధర్మప్రసాద్‌ను అంబాజీపేట ఎంఏవోగాను బదిలీ చేశారు. ఎ.గౌరీదేవిని సీతానగరం ఎంఏవోగాను, జోకా అమృతను ప్రత్తిపాడు ఎంఏవోగాను, శాంతాఒలివ్‌ను అనపర్తి ఎంఏవోగాను, కె.సునీతను ఆలమూరు ఏడీఏ కార్యాలయ ఎంఏవోగాను, పి.పద్మలతను కడియం ఎంఏవోగాను, కె.ప్రవీణ్‌ను అమలాపురం ఎంఏవోగాను, ఎస్.పవన్‌కుమార్‌ను అమలాపురం ఏడీఏ కార్యాలయ ఎంఏవోగాను, కె.విజయను అల్లవరం ఎంఏవోగాను, ఎస్.లక్ష్మీలావణ్యను రావులపాలెం ఎంఏవోగాను, బీ.రవిని కపిలేశ్వరపురం ఎంఏవోగాను, ఏఎస్.మూర్తిని కె.గంగవరం ఎంఏవోగాను బదిలీ చేశారు. ఎస్.సత్య ప్రసాద్‌ను పెదపూడి ఎంఏవోగాను, కె.ఏసుబాబును గోపాలపురం ఎంఏవోగాను, టీవీఆర్. మణిదీప్‌ను రామచంద్రపురం ఎంఏవోగాను, కె.ద్వారకాదేవిని కొత్తపేట ఎంఏవోగాను, కె.కళ్యాణ్‌సూర్యకుమార్‌ను రాజానగరం ఎంఏవోగాను, ఎం.వాణీని ఐ.పోలవరం ఎంఏవోగాను, బీ.జ్యోతిని సామర్లకోట ఎస్టీఎల్ ల్యాబ్‌కు బదిలీ చేశారు. వీరంతా రెండురోజుల్లో సంబంధిత మండలాల్లో బాధ్యతలు స్వీకరించి ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో రైతులకు సలహాలు, సూచనలు అందివ్వాలని, క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని రాష్ట్ర డైరక్టర్ డిల్లీరావు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.



పుట్టినరోజు వేడుక సందర్భంగా దత్తత తీసుకున్న పిల్లలతో మంత్రి సుభాష్, ఆయన తండ్రి సత్యం

పేదరికంతో ఏ ఒక్కరి చదువూ ఆగకూడదు

- సీఎం చంద్రబాబు ఆశయం మేరకు 63 మంది పేద పిల్లలను దత్తత తీసుకున్నా
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ద్రాక్షారామ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆశయం మేరకు పి-4లో భాగంగా 63 మంది పిల్లలను దత్తత తీసుకున్నానని, వారిని ఉన్నత చదువులు చదివించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. మంగళవారం రాత్రి వెంకటాయపాలెంలోని సాయిమాధవానంద ఫంక్షన్ హాలులో జరిగిన ఆయన పుట్టిన రోజు వేడుకల అనంతరం 63మంది పేద విద్యార్థులను మంత్రి దత్తత తీసుకున్నారు. వారి సమక్షంలో కేక్ కట్ చేశారు. వారికి ఉద్యోగం వచ్చే వరకు చదివించే బాధ్యత తీసుకుంటానని వెల్లడించారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరి చదువూ ఆగకూడదన్నారు. తన పిలుపునకు స్పందించి పేద విద్యార్థుల చదువుకు దాతలు రూ.20లక్షలు విరాళం అందజేయడం అభినందనీయమన్నారు. మంత్రి హోదా అలంకారం కాదని, ప్రజలకు సేవచేసుకునే గొప్ప అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధులతో రామచంద్రపురంలో త్వరలో అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం చేపడతామన్నారు. ఇందుకు ఉప్పుమిల్లికి చెందిన యాళ్ల కుటుంబసభ్యులు రూ.50లక్షలు విలువచేసే 50 సెంట్లు స్థలం సమకూర్చడం సంతోషకరమన్నారు. 8మందికి బడ్డీ కొట్లు, ఇద్దరు నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం, ఎనిమిది మందికి గుండె శస్త్రచికిత్స చేయించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శిరోముండనం బాధితులకు ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ



'నన్నయ'లో నేడు మెగా యోగాంధ్ర

దివాన్‌చెరువు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం మెగా యోగాంధ్ర జరుగుతుందని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. మంగళవారం ఆమె అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, విశ్వవిద్యాలయ అధికారులు హాజరవుతారని తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంతో పాటు అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు భాగస్వాములవుతారని చెప్పారు.

46 ఏళ్ల తర్వాత...

రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



డీఎంహెచ్ స్కూల్ 1980-81 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల గ్రూప్ ఫొటో

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం బైపాస్ రోడ్డులోని డీఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం స్థానిక ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. 1980-81 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న 66 మంది విద్యార్థులు 46 ఏళ్ల తరువాత కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగ క్షేమాలు తెలుసుకున్నారు. నాడు తరగతి గదిలో చేసిన అల్లరి చేష్టలను, మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన సైన్సు ఉపాధ్యాయుడు దూర్వాసుల రామకృష్ణ, పీఈటీ సప్పా సుబ్బారావులను సత్కరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బొమ్మిశెట్టి మల్లికార్జునరావు, ఎం.చంద్రశేఖర్, కోన రామకృష్ణ, గుబ్బల బాలు, గీసాల అప్పారావు, భూర రమేష్, ఏవీడీ ప్రసాద్, జేఈ శ్రీమన్నారాయణ, గుదే సత్యనారాయణ, పైడి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్ఎంల కౌన్సెలింగ్ రీ వెరిఫికేషన్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆదివారం జరిగిన సచివాలయ ఏఎన్ఎంల కౌన్సెలింగ్ ప్రక్రియను రీ వెరిఫికేషన్ చేయనున్నారు. ఇందుకు హాజరు కావాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తూ కౌన్సెలింగ్‌కు హాజరైన 390 మందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను అనుసరించి బుధవారం వీరంతా డీఎంహెచ్‌వో కార్యాలయానికి హాజరవుతారు. ర్యాంకుల ప్రకారం పిలవలేదని, సబ్ సెంటర్లలో ఉన్న ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఎటు వంటి ఆదేశాలు అందలేదని కలెక్టర్‌కు పలు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో రీవెరిఫికేషన్ నిర్వహించనున్నారు. అభ్యర్థులు నో డ్యూస్, నో చార్జ్ పెండింగ్ సర్టిఫికెట్లు, అప్ టు డేట్ సర్వీస్ రిజిస్టర్ కాపీలతో హాజరు కావాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

పట్టు శాస్త్రవేత్తగా భువనేశ్వరి




బెంగళూరు సెంట్రల్ సిల్క్‌బోర్డు నుంచి నియామకం

గొల్లప్రోలు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి సెంట్రల్ సిల్క్ బోర్డు నుంచి ప్రత్యేకంగా శాస్త్రవేత్తను నియమించారు. పట్టుసాగులో రైతులు కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కోవడం, స్థానికంగా శాస్త్రవేత్తలు అందుబాటులో లేక, ఇతర ప్రాంతాల నుంచి రావాల్సి ఉండడంతో వారికి సలహాలు, సూచనలు అందడంతో తీవ్ర జాప్యం చోటుచేసుకునేది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి ఈ విషయం వెళ్లడంతో సెంట్రల్ సిల్క్ బోర్డు అధికారులను సంప్రదించారు. దీంతో సెంట్రల్ సిల్క్ బోర్డు బెంగళూరు విభాగంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న భువనేశ్వరిని చేబ్రోలులో ప్రత్యేకంగా నియమించారు. ఈమె విధుల్లో చేరారు. చేబ్రోలు పట్టు పరిశ్రమల కేంద్రం నుంచే ప్రస్తుతం పని చేయనున్నారు. పూర్తిస్థాయిలో ల్యాబ్, కార్యాలయం ఏర్పాటుకు సెంట్రల్ సిల్క్ బోర్డు అధికారులు అనుమతి ఇచ్చారు. త్వరలోనే ల్యాబ్ ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన సమాచారం, పట్టుసాగుపై సలహాలు, సూచనలు ఇస్తానని శాస్త్రవేత్త భువనేశ్వరి చెప్పారు.

లక్కీ డ్రా పేరిట రూ.లక్షల్లో వసూళ్లు

- 32 వారాలు కట్టండి... డ్రా తగలకుంటే వెండి పట్టీలు
- ఏజెన్సీలో గిరిజనులకు టోకరా వేస్తున్న కేటుగాళ్లు
- వాట్సాప్ గ్రూప్‌లో సభ్యులుగా చేర్చి అంటగడుతున్న వస్తువులు
- మోసపోతున్న ప్రజలు, చోద్యం చూస్తున్న అధికారులు



లక్కీ డ్రా పేరుతో ముద్రించిన పత్రం

ఎటపాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎప్పటి నుంచో కొనసాగుతున్న లక్కీ డ్రా స్కీమ్ ఇది... మా వద్ద లక్కీ స్కీమ్‌లో సభ్యులుగా ఉంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది. అదృష్టం వరిస్తే విలువైన వస్తువులు పొందవచ్చు. స్కీమ్‌లో పెట్టిన సొమ్ములకు గ్యారెంటీ ఉంటుంది. వారానికి ఒక్కసారి డ్రా తీస్తాం.... డ్రా తగిలితే అదృష్టం మీదే... 32 వారాల్లో చివరి వరకు మీకు డ్రా తగలకుంటే కట్టిన సొమ్ములతో 4 తులాల వెండి పట్టీలు ఇస్తాం అంటూ ఏజెన్సీలో ఇటీవల లక్కీ డ్రా పేరుతో కొందరు గిరిజనులను బురిడీ కొట్టించేందుకు వారి నుంచి వారానికి ఒక్కసారి డ్రా పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారు. గిరిజన గ్రామాలే లక్ష్యంగా చేసుకుని కొందరు రూ.లక్షల్లో వసూళ్లు చేస్తున్నారు. ఎటపాక మండలంలోని అయ్యవారిపేట, కాపవరం, పంగొమ్ముకొయగూడెం, సీతాపురం, ఎర్రబోరు తదితర గిరిజన గ్రామాలతోపాటు పోలవరం విలీన మండలైన వీఆర్‌పురం, ఏలూరి జిల్లాలోని కుక్కునూరు, తదితర ప్రాంతాలకు చెందిన వారి నుంచి లక్కీ డ్రా పేరుతో వసూళ్లు నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు సభ్యుల కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, అందులో స్కీమ్ వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. తెలంగాణలోని భద్రాచలానికి చెందిన కొందరు వ్యక్తులు లక్కీ డ్రా పేరుతో గిరిజన గ్రామాల్లో తిష్ట వేస్తూ గిరిజనుల అమాయకత్వాని అసరాగా చేసుకుని రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు. లక్కీ స్కీమ్ పేరుతో ఇప్పటికే గిరిజనుల నుంచి అధిక మొత్తంలో కట్టించారు.

వారానికి రూ.200 చొప్పున..

ఇటీవల ఎటపాక ఏజెన్సీలో కొందరు లక్కీ డ్రా పేరుతో ముద్రించిన పత్రాలతో ఊరూరు తిరుగుతూ పంచుతున్నారు. తర్వాత లక్కీ స్కీమ్‌లో సభ్యులుగా చేరాలని, రూ.200 వందలకే లక్కీ డ్రాలో విలువైన వస్తువులు మీ సొంతం అవుతాయని ఊదరగొడుతున్నారు. దాంతో అమాయక గిరిజనులు నిజమే అని నమ్ముతున్నారు. దీంతో వారానికి రూ.200 చొప్పున సొమ్ములు కడుతున్నారు. అయితే మొత్తం స్కీమ్ గడువు 32 వారాలు ఉంటుందని, అందులో 600 మందిని సభ్యులుగా చేర్చుకున్నారు. ఇందులో అత్యధికులు గిరిజనులే. ఇప్పటికే ఎటపాకలోని గ్రామాల్లో లక్కీ డ్రా పేరుతో రూ.లక్షల్లో వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. పేరుకు డ్రా తీసి రూ.300 నుంచి రూ.500 విలువైన వస్తువులు డ్రా తగిలాయంటూ అంటకడుతున్నారు. 32 వారాల పాటు తప్పకుండా సొమ్ములు కట్టాలని మధ్యలో ఆపేస్తే తిరిగి డబ్బులు ఇవ్వమని చెబుతున్నారు. 32 వారాల్లో డ్రా తగలకుంటే ఆ సభ్యుడికి 4తులాల వెండిపట్టీలు ఇస్తామని నమ్మబలుకుతున్నారు.

గతంలో ఇదే తరహాలో...

రెండేళ్ల క్రితం ఇదే తరహాలో ఎటపాక మండలంలోని కృష్ణవరం, భూపతిరావుపేట, కొత్తూరు, కన్నాపురం, లక్ష్మీపురం, కుసుమనపల్లి, తదితర గ్రామాల్లో లక్కీ డ్రా పేరుతో కొందరు రూ లక్షల్లో వసూళ్లు చేసి బురిడీ కొట్టించి, చివరకు బోర్డు తిప్పేస్తారు. అప్పుడు భద్రాచలం సమీపంలోని సారపాక కేంద్రంగా నిర్వహణ సాగిస్తున్నామని, ఆఫీస్ కూడా అక్కడ ఉందని నమ్మబలికించారు. ఇదే మాదిరిగా ముందు వారాల్లో డ్రా తగిలాయంటూ తక్కువ రకం వస్తువులు గిరిజనులకు ఇంటికి తీసుకొచ్చి ఇచ్చారు. నమ్మిన గిరిజనులు ఆ తర్వాత సొమ్ములుతా కట్టారు. రూ.లక్షలో వసూళ్లు చేసిన తర్వాత నిర్వాహకులు బోర్డు తిప్పేసి పరారయ్యారు. దాంతో సొమ్ములు చెల్లించిన గిరిజనులు లబోదిబోమన్నారు. అధికారులు ఇకనైనా స్పందించి ఇలాంటి వాటిపై గిరిజనులకు అవగాహన కల్పించడంతో పాటు లక్కీ డ్రా పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆలయాల్లో హుండీలే టార్గెట్


అనపర్తి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ శ్రీనునాయక్

- పలుచోట్ల 15 కేసులు
- ఒకే రాత్రి 6 దేవాలయాల్లో చోరీలు
- నిందితుడిని అరెస్టు చేసిన అనపర్తి పోలీసులు

అనపర్తి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల్లో హుండీలను టార్గెట్‌గా పెట్టుకుని చోరీలు చేస్తున్న వ్యక్తిని అనపర్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం అనపర్తి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌ఐ శ్రీనునాయక్ వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సోమాలమ్మ ఆలయ సమీపానికి చెందిన ప్రగడ నాగశివ ఈనెల 7వ తేదీన రాత్రి అనపర్తి మండలంలోని కుతుకులూరు, పులగుర్త, పెడపర్తి గ్రామాల్లోని ఆరు ఆలయాల్లో హుండీలను పగులగొట్టి చోరీలు చేశాడు. దీనిని సవాల్‌గా తీసుకున్న అనపర్తి పోలీసులు నిందితుడి కోసం వెతుకులాట ప్రారంభించారు. కదలికలపై దృష్టిసారించిన పోలీసులు మంగళవారం అనపర్తి దేవీచౌక్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ విషయాలు బయటపడ్డాయి. నాగశివపై ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో 2, రావులపాలెంలో 2, లక్కవరం ఒకటి, కొవ్వూరు టౌన్‌లో ఒకటి, కడియంలో ఒకటి, దర్మాజిగూడెంలో 2, పి.గన్నవరంలో ఒకటి, మండపేటలో 2, అనపర్తిలో 2 కేసులు ఉన్నాయని ఎస్‌ఐ పేర్కొన్నారు. పెద్దగా సొమ్ము రికవరీ లేకపోయినా వరుస దొంగతనాలపై ఈ కేసును సీరియస్‌గా తీసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు తెలిపారు. ఈ కేసును చేధించేందుకు కృషిచేసిన కానిస్టేబుల్స్ తమ్మారావు, సత్యనారాయణ, వెంకట్రావు, నాగేంద్ర, రఘు, త్రిమూర్తులను జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ విద్య, సీఐ సుమంత్ తదితరులు అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్‌ఐ బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంకు నుంచి ఫోన్ అని చెప్పి..
ఓటీపీతో రూ.5.10 లక్షలు లాగేసి!

కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నరేంద్రపురంలో సైబర్ మోసం

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పి.గన్నవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం మీ వ్యక్తిగత ఖాతాను సీజ్ చేశారు, ఓటీపీ చెప్పాలని మాయమాటలు చెప్పడంతో పాటు ఓటీపీ ద్వారా ఖాతాదారుడు పేరున లోన్ తీసుకుని ఆ సొమ్మును కూడా దోచేశాడు ఓ సైబర్ నేరగాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నరేంద్రపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... నరేంద్రపురానికి చెందిన నేలపూడి శ్రీనివాసరావుకు గత నెల 27వ తేదీన యాక్సిస్ బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి మీ వ్యక్తిగత ఖాతా సీజ్ అయ్యిందని అవతల వ్యక్తి చెప్పాడు. మీరు ఓటీపీ చెప్తే మీ ఖాతా తెరవబడుతుందని చెప్పాడు. దీంతో ఓటీపీ చెప్పగా రూ.10 వేలు కట్ అయ్యినట్టు చూపించింది. వెంటనే బ్యాంకులో సమాచారం ఇవ్వగా మీ ఖాతాను సైబర్ నేరగాళ్లు హాక్ చేశారని, ఫోన్ నెంబర్‌ను సైతం తమ నెంబర్‌తో లింక్ చేసుకున్నారని చెప్పారు. మళ్లీ ఫోన్ చేస్తే ఓటీపీ చెప్పవద్దని బ్యాంకు సిబ్బంది సూచించారు. అయితే 29వ తేదీన సైబర్ నేరగాడు మళ్లి ఫోన్ చేసి మీఖాతాలో కట్ అయిన రూ.10వేలు వెనక్కి వస్తాయి ఓటీపీ చెప్పాలని కోరగా శ్రీని వాసరావు ఓటీపీ చెప్పాడు. దీంతో రూ.10వేలు వెనక్కి రాకపోగా ఆన్‌లైన్‌లో శ్రీనివాసరావు ఖాతా ద్వారా ఆ సైబర్ నేరగాడు రూ.5 లక్షల రుణం పొంది. వాటిని కూడా ఓటీపీ ద్వారా లాగేశాడు. పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు.

రీసైక్లింగ్ ఆయిల్ కంపెనీలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు


రీసైక్లింగ్ ఆయిల్ కంపెనీలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్, ఇతర శాఖల అధికారులు

లారీలు, రీసైక్లింగ్ టర్పంటాయిల్ సీజ్

కాకినాడ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని ఆటోనగర్‌లో రీసైక్లింగ్ ఆయిల్ కంపెనీలో మంగళవారం రాత్రి విజిలెన్స్, పౌరసరఫరాలు, ఇతర శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ కంపెనీలో అక్రమ కల్తీడీజిల్ అమ్మకాలు, రీసైక్లింగ్ ఆయిల్ తయారీ, ఆయిల్ నిల్వలపై కొందరు సంబందిత అధికారులకు ఫిర్యాదులు చేయడంతో అధికారులు తనిఖీలు చేశారు. ఎస్‌పీఏఎఫ్ పెట్రోలియం యూనిట్‌పై రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ తాతారావు, సీఐలు, కాకినాడ పౌరసరఫరాలశాఖ ఏఎస్‌వో ప్రసన్నలక్ష్మీదేవి, కాకినాడ అర్బన్ డీటీ అనిల్‌కుమార్, తూనికలు, కొలతలు, జీఎస్టీ, కార్మికశాఖ, కాలుష్యనియంత్రణామండలికి సంబందించిన అధికారులు అర్ధరాత్రి వరకూ తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం. అధికారులు చెన్నై నుంచి ట్యాంకరు లారీ ద్వారా తీసుకువచ్చిన టర్పంటాయిల్‌ను గుర్తించారు. అయితే దానికి జీఎస్టీబిల్లులు ఉన్నప్పటికీ దానిలో పెట్రోల్ కూడా కలిసి ఉంటుందనే కారణంతో పౌరసరఫరాల శాఖాధికారులు సీజ్ చేశారు. అధికారులు 2 ఆయిల్ శ్యాంపిల్స్ సేకరించి 2 లారీలు 25కేఎల్ టర్పంటాయిల్, 12కేఎల్ రీసైక్లింగ్ ఆయిల్, 34కేఎల్ ప్రాసెస్ చేసిన ఆయిల్ సుమారు రూ.75లక్షల విలువైన వాటితోపాటూ కంపెనీనీ సీజ్ చేసినట్టు ఏఎస్‌వో తెలిపారు. తాము సేకరించిన ఆయిల్ నమూనాలను ప్రయోగశాలకు పంపి వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. విజిలెన్స్, ఇతరశాఖల అధికారులు ఆయిల్ నమూనాలను తీసి జిల్లా కలెక్టర్ కోర్టుకు సమర్పిస్తారన్నారు.

ఐదుగురు రెవెన్యూ అధికారులపై క్రమశిక్షణ చర్యలు

వెలువడిన ఉత్తర్వులు

ఎటపాక, జూన్17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో గతంలో రెవెన్యూ అధికారులుగా విధులు నిర్వర్తించిన ఐదుగురు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే దిశగా మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఎటపాకలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన సిరిగినీడి సుబ్బారావు, తహశీల్దార్‌గా పనిచేసిన చాట్ల వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన కారం సుబ్బారావు, మండల సర్వేయర్‌గా పనిచేసిన పల్లి డీల్లీశ్వరరావు, ఆర్ఐగా పనిచేసిన గొంది రాంబాబుపై పలు ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు చేపట్టిన సాధారణ విచారణలో వారిపై వెలువడ్డ ఆరోపణలు స్పష్టమైనట్టుగా ఏసీబీ డీజీ కార్యాలయం నుంచి రెవెన్యూ శాఖ ఉన్నతస్థాయి అధికారులకు పూర్తి వివరాలతో నివేదికను అందజేయడం జరిగింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు అధికారులపై చర్యలకు ఏసీబీ శాఖ సిఫార్సు చేసిన నేపథ్యంలో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మీ క్రమ శిక్షణ చర్యలు తీసుకునే దిశగా ఉత్తర్వులు జారీ చేశారు.

అంతర్‌రాష్ట్ర నేరస్తుడు అరెస్ట్



కోరుకొండలో నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

కోరుకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం జంబుపట్నం పంచాయతీ పరిధిలో నివాసం ఉంటూ అనేక రాష్ట్రాల్లో నేరాలకు పాల్పడడం, గంజాయి అక్రమ రవాణా చేయడం వంటి కార్యకలాపాలు సాగిస్తు అంతర్‌రాష్ట్ర నేరస్తుడుగా పేరుగాంచిన కాళ్ల నరేష్‌ను కోరుకొండ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు హెడ్ కానిస్టేబుల్ ఉదయభాస్కర్, కానిస్టేబుల్ ప్రసాద్ నేరస్తుడిని పట్టుకున్నారు. నరేష్‌పై పలు రాష్ట్రాల్లో సుమారు 90కేసులు పైగా ఉన్నాయన్నారు. అతడిని పట్టుకోవడానికి కర్ణాటక, మరి కొన్ని రాష్ట్రాల పోలీసులు తిరుగుతున్నారు. నిందితుడిని పట్టుకున్న పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ, నార్త్‌జోన్ డీఎస్పీ నగదు రివార్డు అందజేశారు. కానిస్టేబుళ్లను సీఐ సత్యకిషోర్, ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది అభినందించారు.

తాళ్లరేవు సీహెచ్‌సీ డాక్టర్ స్నేహలత సస్పెన్షన్

తాళ్లరేవు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు సీహెచ్‌సీ సూపరింటెండెంట్, చిన్న పిల్లల వైద్యురాలు డాక్టర్ స్నేహలత సస్పెండ్ అయినట్టు డీసీహెచ్‌వో డాక్టర్ స్వప్న మంగళవారం తెలిపారు. ఈ నెల 14న వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి చెందగా కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నివేదికను కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌కు అందించారు. ఈ నేపథ్యంలో స్నేహలతను సస్పెండ్ చేస్తూ తాడేపల్లి విజిలెన్స్ డీఎస్ఏహెచ్ ఉత్తర్వులు జారీ చేశారు.

కాకినాడ జీజీహెచ్‌లో నర్సులకు కౌన్సెలింగ్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం నర్సుల కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. పరిపాలనా విభాగ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ లావణ్యకుమారి పర్యవేక్షించారు. తాజా బదిలీల్లో 55 స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీలు ఏర్పడగా జోన్ పరిధిలోనే వివిధ ప్రాంతాల నుంచి 50 మంది స్టాఫ్ నర్సులు జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. మరో 5 ఖాళీలు కొనసాగుతున్నాయి. జీజీహెచ్‌లో పనిచేస్తున్న 9మంది హెడ్ నర్సులు బదిలీపై వెళ్లారు. వారి స్థానాల్లో ఒక్కరు చేరలేదు. స్టేషన్ సీనియారిటీ ప్రకారం వీరంతా రాజమహేంద్రవరం, విజయవాడ, ఏలూరు, మచిలీపట్నం ఆసుపత్రులకు బదిలీ అయ్యారు. నర్సింగ్ ట్యూటర్లలో ఒక పోస్టు రిటెన్షన్ కాగా మరో పోస్టు తాజా బదిలీల్లో భర్తీ అయ్యింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఎటపాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలోని బూరుగువాయితండా గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 42 నుంచి 45 మధ్యలో ఉంటుంది. మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుండడంతో గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో గ్రామంలో ఖననం చేశారని స్థానిక పోలీసులు చెప్పారు.

సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ కలెక్టర్ పూజలు


కలెక్టర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో కలెక్టర్ దంపతులకు ప్రసాదం అందజేశారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా కేసులో
17 మందికి జరిమానా

గొల్లప్రోలు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన కేసులో 17మందికి జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.వెంకట అపర్ణ తీర్పు చెప్పారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన మహిళ తనను ఒక వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడని, తనకు న్యాయం చేయాలంటూ 2019 నవంబరు 29వ తేదీ రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించగా ఆమెకు మద్దతుగా బంధువులు అందోళన చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారంటూ అప్పటి ఎస్‌ఐ రామలింగేశ్వరరావు కేసు నమోదు చేశారు. దీనిపై వాదోపవాదాల అనంతరం 17 మందికి ఒక్కొక్కరికి రూ.100 వంతున జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. అప్పటి ఏపీపీ ఏ.నాగరోజా ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

రెండు కేసుల్లో తొమ్మిదిమందికి రిమాండ్

ఆలమూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆలమూరు స్టేషన్ పరిధిలో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవల నేపథ్యంలో ఆలమూరు పోలీసులు రెండు కేసులు నమోదు చేయగా ఈ కేసుల్లో నిందితులు 9మందికి ఆలమూరు కోర్టు రిమాండ్ విధించిందని ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ తెలిపారు. కోనసీమ జిల్లా ఆలమూరులో ఈనెల 15న రాత్రి పలివెల తేజ, కొమ్ము రోహిత్ వర్గాల మధ్య పాత గొడవల కారణంతో ఇరువర్గాలు దాడులు చేసుకోగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలమూరు పోలీసులు పలివెల తేజ, కొమ్ము రోహిత్ వేరు వేరుగా ఇచ్చిన ఫిర్యాదులతో పలువురిపై కేసులు నమోదు చేశారు. కేసుల్లో 9మందిని అరెస్టు చేసి మంగళవారం ఆలమూరు కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి వీరికి రిమాండ్ విధించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం తరలిస్తున్నట్టు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 36 మందికి కాకినాడ 3 వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి శ్రీదేవి జైలు, జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1 అండ్ 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు సోమవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 36 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా నాయ్యమూర్తి వారిలో ఒకరికి 5రోజుల జైలు శిక్ష, మరో 17 మందికి 2రోజుల చొప్పున జైలు శిక్ష, అలాగే మరో 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1,80,000 జరిమానా విధించారు.

అదుపులోకి డయేరియా

రౌతులపూడిలో ఆసుపత్రిని పరిశీలించిన డీసీహెచ్‌ఎస్ సరిత

బాధితులను పరామర్శించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ


డయేరియా బాధితులకు పండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహారం తిని డయేరియా బారిన పడిన కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సబ్ ప్లాన్ ఏజెన్సీ రాఘవపట్నం గ్రామశివారు దబ్బాది ప్రజలు కోలుకుంటున్నారు. రౌతులపూడి ఆసుపత్రిలో వారికి మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు. 46 మంది చికిత్స పొందుతుండగా మంగళవారం ఏడుగురిని డిశ్చార్జి చేశారు. డీసీహెచ్ఎస్ సరిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించి వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. వారికి అందించాల్సిన వైద్యసేవలపై వైద్యులకు సూచనలు చేశారు. మందులను పరిశీలించారు. దబ్బాది, సార్లంక గ్రామాల్లో వైద్యబృందం ఇంటింటికి తిరిగి ప్రజలకు సూచనలు చేశారు. శాంపిల్స్‌లను సేకరించారు. వైద్య శిబిరం నిర్వహించి మందులు అందించారు. రౌతులపూడి ఆసుపత్రిలో డయేరియాతో చికిత్స పొందుతున్న దబ్బాది ప్రజలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులకు సూచించారు. పండ్ల కిట్లను అందజేశారు. వారి కోసం ఫ్యాన్లను సమకూర్చారు. టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, ఎంపీడీవో శివరామకృష్ణయ్య, యువనేత చంద్రమౌళి ఉన్నారు.

వృద్ధురాలి మరణం డయేరియాతో కాదు

కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ) జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం దబ్బాదికి చెందిన వంతల చెల్లాయ్యమ్మ (65) మరణం డయేరియా వల్ల కాదని కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ మంగళవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. రౌతులపూడి మండలంలోని దబ్బాది, సత్యవాడ గ్రామాలకు చెందిన సుమారు 60 మంది ఈనెల 14న అల్లూరి జిల్లా పాడేరులోని మోద కొండమ్మ అమ్మవారి దేవాలయానికి దర్శనార్థం వెళ్లి అక్కడ నిల్వ ఉన్న పులిహోరను ఆరోజు రాత్రి తినడం ద్వారా ఆహారం కలుషితమై వాంతులు, విరోచనాలకు గురయ్యారన్నారు. అనంతరం వారికి పాడేరులోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించి ఇళ్లకు పంపించడం జరిగిందన్నారు. అయితే వంతల చెల్లాయ్యమ్మ అప్పటికే మధుమేహం, ఇతర కోమార్బిడ్ వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతూ మరణించిందని, ఆమె మరణం డయేరియాతో మాత్రం కాదని స్పష్టంచేశారు. దబ్బాది, సత్యవాడ గ్రామాల్లో ఇంటింటికి సర్వే నిర్వహించి వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న 43 మందిని గుర్తించి రౌతులపూడి సీహెచ్‌సిలో చికిత్స అందించడం జరిగిందన్నారు. ఎవరు ఆందోళన చెందవద్దని, క్షేత్రస్థాయిలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పనిచేస్తున్నట్టు నాయక్ తెలిపారు.

జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్‌కు
ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు


ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త శ్యామ్‌కుమార్, అధికారులను అభినందిస్తున్న వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్ సెల్‌కు రాష్ట్ర స్థాయిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు లభించింది. గుంటూరులో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర ఛైర్మన్ వైడీ రామారావు అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని 2023-24కు గానూ అత్యధికంగా రక్తాన్ని సేకరించిన విద్యాసంస్థగా జేఎన్టీయూకే నిలిచింది. దీనికిగానూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం అవార్డు ను ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌ను వీసీ ఛాంబర్‌లో కలువగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు ఎన్ఎస్ఎస్ అధికారులు రమణాజీ, కిరణ్మయి పాల్గొన్నారు.



కాలుష్యం కోరల్లో గోదారమ్మ..

రాజమహేంద్రవరంలోని గోదావరి నదీ జలాలు కాలుష్యమవుతున్నాయి. ముఖ్యంగా పుష్కర్‌ఘాట్‌లో ప్రజలు స్నానం చేయడానికి ఇబ్బందికర పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్త, చెదరాలే కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గోదావరిలో కాలుష్యం తొలగించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

నేడు డయల్ యువర్ డీఎం
అమలాపురం రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై బుధవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. సూచనలను సెల్ 9581932678కు తెలియజేయాలన్నారు.

అయినవిల్లి తహశీల్దార్‌గా విద్యాపతి
అయినవిల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి తహశీల్దార్‌గా సీహెచ్ విద్యాపతి బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొవ్వూరు నుంచి బదిలీపై వచ్చారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన విద్యాపతికి వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన నాగలక్ష్మమ్మ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. లూటుకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను మంగళవారం విద్యార్థులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అనేక మౌలిక సదుపాయాలు, వసతులు కల్పిస్తుందని, వాటిని విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మండలంలో 72 పాఠశాలలకు సంబంధించి 3,373మంది విద్యార్థులకు ఈకిట్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, సుందరనీడి చిన్నీ, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, నాయకులు బోనం బాబు, కడలి నూకరాజు, మద్దాల కృష్ణమూర్తి, కోట బ్రహ్మానందం, మద్దాల తమ్మన్న, కడలి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


లూటుకుర్రు హైస్కూలులో విద్యార్థినికి విద్యామిత్ర కిట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
మామిడికుదురు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆకాంక్షించారు. పాశర్లపూడిలంక గ్రామానికి చెందిన కోలా ప్రవీణ్‌కుమార్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 328వ ర్యాంకు, ఎంసెట్‌లో 153వ ర్యాంకు సాధించాడు. అదేగ్రామానికి కోలా మధువల్లీ 10వ తరగతి ఫలితాల్లో 591మార్కులు సాధించిన కలెక్టర్ చేతులమీదుగా షైనింగ్‌స్టార్ అవార్డును అందుకుంది. విద్యార్థులను మంగళవారం పాశర్లపూడిలో దుశ్శాలువాలు, పూలమాలలతో ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, నాయకులు జాలెం శ్రీనివాసరాజు, పెనుమాల లక్ష్మి, బోనం బాబు, పితాని వెంకటేశ్వరరావు, కోలా సత్తిబాబు, తెలగారెడ్డి బులినాగేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలి

- సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మీ
- సీఆర్‌ఎంటీలతో సమీక్ష

అమలాపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ద్వారా అమలు చేస్తోన్న ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాల్సిన బాధ్యత క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్స్ (సీఆర్‌ఎంటీ)లపై ఉందని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ పేర్కొన్నారు. అమలాపురం సూర్యనగర్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాలోని స్కూలు కాంప్లెక్సు సీఆర్‌ఎంటీలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏపీసీ మమ్మీ మాట్లాడుతూ విద్యాశాఖ, సమగ్రశిక్ష ద్వారా వివిధ పథకాలు అమలు చేస్తున్నట్టు వివరించారు. పథకాల అమలులో సీఆర్‌ఎంటీల పాత్ర ఏవిధంగా కీలకమో వివరించారు. ప్రధానంగా స్టూడెంట్ కిట్స్ పంపిణీ, ఉపాధ్యాయుల శిక్షణ తదితర కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సీఎంవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ ఈనెల 23నుంచి 26వరకు ప్రధానోపాధ్యాయులకు జిల్లాస్థాయిలో లీడర్‌షిప్ ట్రైనింగ్, 23నుంచి 28వరకు గత ఏడాది ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ పొందిన 1వ తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు రెండో దశ శిక్షణకు ఎంపికచేసిన కేంద్రాల్లో ఇస్తామన్నారు. ఏఎస్వో కె.నారాయణరావుతో పాటు జిల్లాలోని 22 మండలాల పరిధిలోని స్కూలు కాంప్లెక్సు సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మీ

ఓఎన్జీసీ సేవలను వినియోగించుకోండి
ఉప్పలగుప్తం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పేదలకు ఓఎన్జీసీ అందిస్తున్న సామాజిక సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక లబ్ధి పొందాలని ఆ సంస్థ అసెట్ మేనేజర్ శాంతానుదాస్ సూచించారు. ఆల్ ఇండియా ఓఎన్జీసీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరిపల్లిలో 30మంది మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇప్పించారు. సోమవారం శిక్షణ ముగింపు సందర్భంగా సర్పంచ్ గెడ్డం స్వరూపాసురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు అసెట్‌మేనేజర్ ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.మాజీ సర్పంచ్ గెడ్డం సురేష్‌బాబు, ఆలిండియా ఓఎన్జీసీ ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సీహెచ్ మురళీమోహన్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమపై దృష్టి సారించండి: కలెక్టర్


పశుసంవర్థకశాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గింది. పశువుల సంఖ్య, పాడి ఉత్పత్తులు తగ్గుతున్న పరిస్థితులపై అధికారులు అప్రమత్తతో వ్యవహరించి పాడి పరిశ్రమల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో పశు వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పశువుల పెంపకానికి అంతర పంటలుగా మైదాన ప్రాంతాల్లో పశుగ్రాస విత్తనాలు అందించి పశుగ్రాస అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. పాలఉత్పత్తులపై మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో 640ఎకరాల్లో పశుగ్రాస అభివృద్ధికి భూములు గుర్తించామన్నారు. పశుకిసాన్ క్రెడిట్‌కార్డు ద్వారా పావలా వడ్డీపై రూ.2లక్షల వరకు పాడి పశువుల కొనుగోలుకు రుణాన్ని మంజూరు చేస్తున్నామని, అదేవిధంగా ఎస్‌ఎస్‌జీ, స్త్రీనిధి, ప్రధానమంత్రి ఉపాధిహామీ పథకం, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై రుణాలను బ్యాంకుల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో 1076 మినీ గోకులాలు 90శాతం రాయితీతో నిర్మాణంలో ఉన్నాయన్నారు. మేలుజాతి ముర్రా జెర్సీ ఒంగోలు పశువుల సంఖ్యను పెంచుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఏటిగట్లు, కాల్వగట్ల వెంబడి పశుగ్రాసం పెంచడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పశుసంవర్థకశాఖ అధికారి వెంకట్రావు, పశువైద్యులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో తల్లీబిడ్డల గుర్తింపు


అదృశ్యమైన తల్లీబిడ్డలతో పట్టణ సీఐ వీరబాబు

అమలాపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అదృశ్యమైన తల్లీ బిడ్డలను మూడు రోజుల్లో గుర్తించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం మండలం పేరూరు దూడల వారి వీధికి చెందిన చవ్వాకుల హారతి(24), కుమార్తె నందన (6), కుమారుడు అయాన్‌భార్గవ్(4) ఈనెల14వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి పుట్టింటికి వెళుతున్నట్టు చెప్పింది. అయితే పుట్టింటికి వెళ్లకపోవడంతో భర్త చవ్వాకుల నగేష్ పట్టణ పోలీసులను ఆశ్రయించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆదేశాలతో సీఐ వీరబాబు దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ మనోహర్‌జోషి, కానిస్టేబుల్ రాయుడు శ్రీను అదృశ్యమైన తల్లీబిడ్డలు విశాఖపట్నంలో ఉన్నట్టు గుర్తించి వారిని క్షేమంగా అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు మంగళవారం తీసుకువచ్చారు. కౌన్సిలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును చేధించిన సీఐ వీరబాబు, ఇతర సిబ్బందిని డీఎస్పీ ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

వెయిట్‌లిఫ్టింగ్ శిక్షణ ముగింపు
అమలాపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో నెల రోజులు కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 50మందికి ఉచిత వేసవి వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ శిబిరం నిర్వహించారు. మంగళవారం శిక్షణ ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఫిట్‌నెస్ జిమ్ లైఫ్ మెంబర్ గారపాటి చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ తీర్థం
యానాం, జూన్17(ఆంధ్రజ్యోతి): యానాం గ్రామదేవత మహాలక్ష్మమ్మ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సతీమణి ఉదయలక్ష్మి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఆలయ ఈవో జ్యోతి వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో నిప్పు లగుండం ఏర్పాటుచేశారు. యానాంఅగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సినీ ఆర్కెస్ట్రా నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. సినీఆర్కెస్ట్రా తదితర కార్యక్రమాలను అగ్నికులక్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేరు కృష్ణ, మల్లాడి శామ్యూల్ పర్యవేక్షించారు.

టీడీపీ మండల శాఖ అధ్యక్షుడిగా శ్యామ్‌సుందర్



అయినవిల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలశాఖ అధ్యక్ష ఎన్నికలో భాగంగా నిర్వహించిన పోటీలో వస్కా శ్యామ్‌సుందర్ గెలుపొందారు. మండలశాఖ అధ్యక్షుడిగా శ్యామ్‌సుందర్‌తో పాటు బడుగు భాస్కరజోగేష్ పోటీపడ్డారు. మండలంలో 42మంది గ్రామశాఖల అధ్యక్ష, కార్యదర్శులు ఉండగా శ్యామ్‌సుందర్‌కు 27ఓట్లు, జోగేష్‌కు 15ఓట్లు వచ్చాయి. శ్యామ్‌సుందర్ గెలుపొందినట్టు ప్రకటించారు. ఎన్నిక ప్రక్రియలో మాజీ ఎమ్మెల్సీలు రెడ్డి సుబ్రహ్మణ్యం, చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ పరిశీలకుడు షేక్‌సుభాన్, పరిశీలకుడు పొద్దోకు బాలు, రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష
అమలాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత నెల 31వ తేదీన చెయ్యేరు పర్యటన సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ద్వారా ప్రజావేదికలో స్వీకరించిన 21ఫిర్యాదుల పరిష్కారంపై కలెక్టర్ మహేష్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర స్థాయిలో ఉన్న సమస్యలను పరిపాలన ఆమోదం కోసం ఉన్నతాధికారులకు పంపించి త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలపై సమీక్షించారు. చెయ్యేరు నీటిప్రాజెక్టు వాటర్ స్కీమ్‌కు సంబంధించి, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఆర్‌అండ్‌బీ శాఖకు పంపించారు. గుత్తెనదీవి-జి.మూలపొలం వంతెన, రోడ్ల నిర్మాణం, ముమ్మిడివరం-కాట్రేనికోన రోడ్డు, మురమళ్ల-ఎదుర్లంక రోడ్డు, కరకట్ట బలోపేతం, బీసీ రెసిడెన్షియల్ స్కూలు నిర్మాణం, రామాలయంపేట వరద కరకట్ల బలోపేతం వంటి అభివృద్ధి పనులను దాట్ల సుబ్బరాజు ప్రతిపాదించారు. ఈపనులకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిపై అధికారులతో కలెక్టర్ శాఖలవారీగా సమీక్షించారు. నిధుల మంజూరుకు త్వరితగతిన వాటికి ఆమోదంతెలిపి పనులు చేపట్టాలని కోరారు. స్థానికంగా ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులతో కలెక్టర్ మాట్లాడి సూచనలు చేశారు.

నాణ్యమైన విద్యను అందించేందుకే కరదీపికలు
ముమ్మిడివరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు ఆదర్శిల కరదీపిక ఎంతో ఉపయోగపడుతుందని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఏలూరు రేంజ్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.సుజాతారాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారిత అధికారి బి.శాంతకుమారి మంగళవారం జిల్లాలోని సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పీపీ1, పీపీ2 పుస్తకాలు పిల్లలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వీటిని జాతీయ పాఠ్య ప్రణాళిక ఫ్రేమ్ వర్క్ ఫౌండేషన్ స్టేజ్ మార్గదర్శకాల ఆధారంగా మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ రూపొందించిందన్నారు. అంగన్‌వాడీ టీచర్లంతా కరదీపికలోని అంశాలను పూర్తిగా ఆకలింపుచేసుకుని వాటిద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన సాగించాలన్నారు. జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారిత అధికారిణి బి.శాంతకుమారి మాట్లాడుతూ సీడీపీవోలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వాటిని సక్రమంగా నిర్వహించేలా అజమాయిషీ చేయాలన్నారు. ఈసందర్భంగా ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పీపీ1, పీపీ2 పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీవోలు ఎం.నిహారిక, వై.విజయశ్రీ, వైకేడీ రమాదేవి, ఎ.గజలక్ష్మి, వీవీ వరాహలక్ష్మి, జిల్లా కార్యాలయ పోషణాభియాన్ సిబ్బంది ఉషాదేవి, మీనా, జిల్లాలోని సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు
యానాం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యానాం సుభద్రానగర్‌కు చెందిన 65ఏళ్ల బోండపల్లి దివాకర్ మంగళవారం అదృశ్యమయ్యాడు. తండ్రి అదృశ్యంపై కుమారులు సతీష్, నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వడ్రంగి పనిచేసుకునే దివాకర్ భార్య నాగమణి ఆరునెలల క్రితం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఐపీఆర్వోగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ
అమలాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా నియమితులైన సీహెచ్ శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడి నుంచి బదిలీపై రాజమహేంద్రవరం వెళ్లిన కె.లక్ష్మీనారాయణ నుంచి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బదిలీపై వెళ్లిన డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, డివిజనల్ పీఆర్వో వీవీ రామిరెడ్డి పాల్గొన్నారు.


కలెక్టర్‌ను కలిసిన శ్రీనివాస్

మండల వ్యవసాయాధికారిగా ప్రవీణ్



అమలాపురం రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండల వ్యవసాయాధికారిగా కె.ప్రవీణ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కడలి ధర్మప్రసాద్ బదిలీపై అంబాజీపేట ఏవోగా వెళ్లారు. ప్రవీణ్ కాట్రేనికోన మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం భట్నవిల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ప్రవీణ్ పాల్గొన్నారు. సర్పంచ్ తిరుకోటి సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ యు.వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మండలీక సుబ్రహ్మణ్యశర్మ, నామాడి తారక్, అడపా స్వామి, కాట్రు శ్రీనివాస్, సరిపెల్ల సుబ్బరాజు, కప్పగంతుల భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్లబ్ ఉచిత సేవాదళం వార్షికోత్సవం
కాట్రేనికోన, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తేజస్విని జ్యోతిషాలయం వేదికగా ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపకుడు ఆకొండి నాగరవీంద్ర జోగయ్యశాస్త్రి స్వగృహంలో సభ్యుల సహకారంతో ఉచిత సేవాదళం ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని పలువురు అభినందించారు. ఆకొండి ఉమామహేష్‌శర్మ, ఆణివిళ్ళ శ్రీవాణీ సుబ్బలక్ష్మి, చల్లా గోపి, తాతపూడి కృష్ణ, మల్లాడి రాధాకృష్ణ, సుంకర పవిత్ర, ఆకొండి శ్రీకాంత్, ఆకొండి కిరణ్, చెరుకు మురళి, ఆణివిళ్ళ పవన్, ఆణివిళ్ళ ఫణికాంత్, చెరుకు శివయ్య, ఆకొండి ప్రకాశరావు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదలకు సంక్షేమ ఫలాలు
అంతర్వేది, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన గొంది గ్రామంలో ప్రధాని నరేంద్రమోదీ 11ఏళ్ల సుపరిపాలన దినోత్సవ సభను మంగళవారం నిర్వహించారు. వికసిత భారత్ మండల కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెట్టారన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చారన్నారు. బోనం నాయుడు, ఇందుకూరి సుబ్బరాజు, రావూరి బాబ్జి, బొమ్మిడి నరసింహస్వామి పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలకు వాటర్ డబ్బాల వితరణ
పి.గన్నవరం, జూన్17(ఆంధ్రజ్యోతి):ఆర్.ఏనుగుపల్లి జడ్పీ పాఠశాలకు జనసేన నాయకుడు దైవాల రాంబాబు మంగళవారం 10వాటర్ డబ్బాలను, మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు 2డబ్బాలను అందించారు.

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం
ముమ్మిడివరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని విళ్ల ఈశ్వరమ్మవారి శ్రీకనకదుర్గమ్మ ఆలయ 14వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు, నీరాజనం, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో విళ్ల ఈశ్వరరావు, విళ్ల గణేష్ దంపతులు, గణేశుల బ్రహ్మానందం, సతీష్, నగేష్, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు దంపతులు, రమణాతి శ్రీను, కోమలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి
మలికిపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయడం ద్వారా ఫలితాలు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్ రమ్యప్రియాంక అన్నారు. మంగళవారం మట్టపర్రులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అన్నదాత సుఖీభవ, ఈకేవైసీ, వరి 1318 రకం గురించి వివరించారు. శివరామకృష్ణ, షణ్ముక తదితరులుపాల్గొన్నారు.

18, 19 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
అమలాపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ టవర్ మరమ్మతుల్లో భాగంగా ఈనెల18,19 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆపరేషన్ సిద్దెల రాజబాబు తెలిపారు. 18వ తేదీ ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల మధ్య, 19వ తేదీ ఉదయం 5నుంచి రాత్రి 11గంటల మధ్యలో దఫదఫాలుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రధానంగా అమలాపురం టౌన్, ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అమలాపురం రూరల్, అల్లవరం, అంబాజీపేట, అయినవిల్లి, కొత్తపేట, రావులపాలెం మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నియామకం
అమలాపురం రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆదేశాల మేరకు మండల కమిటీల నియామకం చేపట్టారు. అమలాపురం మండల కమిటీల ఎన్నికకు నిర్వహించిన సమావేశానికి ఆకుమర్తి రమేష్ అధ్యక్షత వహించారు. జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కేబీ మధు, సహాయక ఇన్‌చార్జి డాన్ సూరిమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెస్పీ అధ్యక్షుడిగా మంద రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడిగా చుట్టుగుళ్ల సత్తిబాబు, మాదిగ యువసేన మండలాధ్యక్షుడిగా ఈతకోట మణికంఠలను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులను పలువురు అభినందించారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్, లంక రామకృష్ణ, సత్తాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

5,914మందికి అన్నదాత సుఖీభవ మంజూరు
మామిడికుదురు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం మామిడికుదురు మండలంలో 5,914 మంది రైతులకు మంజూరైందని మండల వ్యవసాయాధికారి ఎస్వీవీ సత్యనారాయణ తెలిపారు. వ్యవసాయాధికారి మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద ఈనెల21న రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలకు రూ.5వేలు చొప్పున జమ చేస్తుం దన్నారు. లబ్ధిదారులను వెబ్‌ల్యాండ్ ఆధారంగా గుర్తించామని, 10సెంట్లు మించి కొబ్బరి, వరి తోట గల రైతులకు మాత్రమే ఈపథకం వర్తిస్తుందని, ఆక్వారైతులకు వర్తించదని, కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిస్తుందన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన
అంబాజీపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అతిసార వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్యశ్రీ సూచించారు. ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అతిసార వ్యాధిపై ముక్కామల సచివాలయ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీహెచ్‌వో రవికుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మంచి ఆహారం, నీరు తీసుకోవడం ద్వారా అతిసార, టైఫాయిడ్, మలేరియా తదితర వాటిని నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీలు
ముమ్మిడివరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీలు నిర్వహించనున్నట్టు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమగ్రశిక్షలో పనిచేస్తోన్న ఐఈఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇనస్ట్రక్టర్లు, సీఆర్‌ఎంటీలు, మండల లెవెల్ అక్కౌంటెంట్లు, సైట్ ఇంజనీర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, మెస్సెంజర్లు, ఆఫీసు సబార్డినేట్లకు బదిలీలు ఉన్నాయన్నారు. బదిలీలకు సంబంధించి కలెక్టర్ చైర్మన్‌గా జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈనెల 19నుంచి 21వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. 23న సీనియారిటీ ప్రకారం జాబితా సిద్ధంచేసి 24న ప్రదర్శిస్తారన్నారు. బదిలీ దరఖాస్తులపై అభ్యంతరాలు ఈనెల27వ తేదీలోగా స్వీకరిస్తారని, అనంతరం 28న సీనియారిటీ జాబితా ప్రదర్శిస్తారన్నారు. బదిలీ దరఖాస్తులు చేసుకున్న వారికి ఈనెల30నుంచి జూలై 2వరకు కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తారన్నారు. బదిలీలపై అభ్యంతరాలుంటే జూలై 5న రాష్ట్ర కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర పథ సంచాలకుల ఆదేశాల మేరకు రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ
ఉప్పలగుప్తం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జడ్పీటీసీ గెడ్డం సంపదరావు కోరారు. మంగళవారం భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, అద్దంకి అమరేశ్వరరావు, అరవ స్వామినాయుడు, అనుపమ పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక
పి.గన్నవరం, జూన్17(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయితైక్వాండో పోటీలకు అంబాజీపేట, పి.గన్నవరం మండలాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్టు కోనసీమ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి పి.త్రిమూర్తులు తెలిపారు. ఈనెల9నుంచి 11వరకు అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు రెండు మండలాలు నుంచి 15మంది విద్యార్థులు హాజరుకాగా ఆరుగురు గోల్డ్‌మెడల్స్ సాధించారన్నారు. జాతీయ స్థాయిలో ఈనెల21నుంచి 24వరకు హరిద్వార్‌లో జరిగే పోటీల్లో ఆరుగురు పాల్గొంటారన్నారు. నలుగురు సిల్వర్, ఇద్దరు బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. విద్యార్థులను జనసేన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అభినందించి నగదు బహుమతులు అందించారు. అనంతరం తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.త్రిమూర్తులు, కోచ్ బార్గవిశ్రీకళను ఎమ్మెల్యే దుశ్శాలువాలతో సన్మానించారు.

యాంత్రీకరణ వైపు రైతులు మొగ్గుచూపాలి

ఎమ్మెల్యే బండారు


రావులపాలెంలో లబ్ధిదారులకు డ్రోన్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీలు వినియోగించుకుంటూ రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం జడ్పీ బాలికల పాఠశాల క్రీడా ప్రాంగణంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులైన రైతులకు డ్రోన్లు, పవర్ టిల్లర్లు అందించారు. ఆయన మాట్లాడుతూ సాగు విధానంలో విప్లవాత్మక మార్పులను రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వాడకం గేమ్ ఛేంజర్‌గా మారుతుందన్నారు. వ్యవసాయానికి సాంకేతికత జోడిస్తే రైతులు లాభాల బాటలో పయనించవచ్చునన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 59 మంది లబ్ధిదార రైతులకు రూ.1.16కోట్ల విలువైన పరికరాలు అందించామన్నారు. ప్రభుత్వం రాయితీ కింద రూ.50,47,340 అందజేయగా మిగిలిందని రైతు భాగస్వామ్యంగా కట్టాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, బీజేపీ నాయకులు అయినవిల్లి సత్తిబాబుగౌడ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ఆత్రేయపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,25,828 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

విద్యార్థులకు నోట్స్ పుస్తకాలు పంపిణీ

కె.గంగవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల, అముజూరు తదితర గ్రామాల్లోని 10 ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నోట్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. విశాఖకు చెందిన శ్రీమల్లిఖార్జున ట్రాన్స్‌పోర్టు యజమాని భోజంకి సోమేశ్వరరావు వీటిని అందజేశారు. మంగళవారం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీని ఆయా గ్రామాల సర్పంచ్‌లు చిల్లే నాగేశ్వరరావు, నానావరపు కల్యాణి పంపిణీ చేశారు. మూడేళ్లుగా విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సోమేశ్వరరావును, ఆయన మిత్రుడు ఉపాధ్యాయుడు పి.గుణవంతుడును ఆయా గ్రామాల సర్పంచ్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, పులిదిండి శ్రీనివాసు, దాసరి శ్రీనివాసు, వెంకటరమణ, మణికంఠ, మల్లిఖార్జున రావు, సి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.


కూళ్ల పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

సైఫాన్ నిర్మాణ పనుల పరిశీలన

ఆత్రేయపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల వద్ద ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్‌లో చేపడుతున్న సైఫాన్, వెల్‌సైఫాన్ నిర్మాణ పనులను డ్రైనేజీ విభాగం ఈఈ ఎంవీవీ కిషోర్ పరిశీలించారు. మంగళవారం వెల్ సైఫాన్ పనులకు సంబంధించిన పనులను కాంట్రాక్టర్ తెలిపారు. తాగునీటి ఇబ్బందులు, ట్రాఫిక్ ఏర్పడకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. నాణ్యత ప్రమాణాలతో సైఫాన్ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ విజయలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షుడు పుత్రసాయిరామ్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలి దుర్గమ్మ ఆలయం వద్ద ప్రమాదంగా ఉన్న మురుగు డ్రైనేజీని పరిశీలించారు.


లొల్ల వద్ద సైఫాన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్రైనేజీ విభాగం ఈఈ కిషోర్


చెల్లూరులో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ

రాయవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): చెల్లూరు గ్రామంలో విద్యార్థులకు మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. చెల్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఉప్పలపాటి శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలిక రాఘవ, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, ఎంజీ నగర్ పాఠశాల హెచ్ఎం కేవీఆర్ తాతాజీ, కృష్ణమ్మ చెరువు పాఠశాల హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు వి.గోపికృష్ణ, కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పాణింగపల్లి వద్ద రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

రోడ్డు పక్కన చెత్త ఉన్నా కనిపించదా?

కె.గంగవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.గంగవరం-పామర్రు ఆర్‌అండ్‌బి రహదారిలో పాణింగపల్లి వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోవడంతో వాహనదారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పాణింగపల్లి, అముజూరు గ్రామాల నుంచి సేకరించిన చెత్తతో పాటు, గ్రామస్తులు రోడ్డు పక్కన చెత్తను పడేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డును తలపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడి చెత్త కారణంగా పందులు స్వైర విహారం చేస్తూ మరింత అపారిశుధ్యం కలిగిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయా గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలు ఉపయోగంలోకి తీసుకువచ్చినా ఎలాంటి ప్రయోజనాలు కన్పించడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పంచాయతీ అధికారులు చెత్త సంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకువచ్చి చెత్త సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి రామగోపాల్

మండల పరిషత్ కార్యాలయం తనిఖీ

ఆత్రేయపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.రామగోపాల్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీవో వెంకటరామన్, పరిపాలనాధికారి రామస్వరూప్, సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఆయన తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వెంటూరు శివారు చొల్లంగిపేటలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం నుంచి కొత్తపేట ముమ్మిడివరం వెళ్లే సర్క్యూట్‌లో పాడైన టవర్లను తొలగించి కొత్త టవర్ల ఏర్పాటులో భాగంగా చొల్లంగిపేటకు గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

జగన్నాథస్వామి రథోత్సవానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రావులపాలెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పూరి జగన్నాథస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జీజీవీ రమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న డిపో నుంచి బయలుదేరి జగన్నాథస్వామి రథోత్సవం అనంతరం అరసవల్లి, కోణార్క్, పూరి, భువనేశ్వర్, సింహాచలం క్షేత్రాల దర్శనం అనంతరం 29న రావులపాలెం కాంప్లెక్స్‌కు చేరుతుందన్నారు. టిఫిన్, భోజన ఖర్చులతో సహా రూ.4,600 టిక్కెట్టు నిర్ణయించామన్నారు. వీటి అడ్వాన్స్ బుకింగ్ కోసం డిపో మేనేజర్ సెల్ 9959225537, అసిస్టెంట్ మేనేజర్ 7382911871లో సంప్రదించాలన్నారు.

వ్యవసాయాధికారిగా మణిదీప్

ద్రాక్షారామ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారిగా టీవీఆర్ మణిదీప్ బాధ్యతలు స్వీకరించారు. పెదపూడి మండలం నుంచి బదిలీపై మణిదీప్ రామచంద్రపురం వచ్చారు. ఇప్పటివరకు వ్యవసాయ అధికారిగా పనిచేసిన సత్యప్రసాద్ పెదపూడి మండలం బదిలీపై వెళ్లారు.

రమేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

రాయవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల వ్యవసాయ అధికారిగా కేవీఎస్ రమేష్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏవోగా పనిచేసిన కొప్పిశెట్టి ప్రభాకర్ మండపేట ఏవోగా బదిలీకాగా ఆయన స్థానంలో కపిలేశ్వరపురం మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న రమేష్‌కుమార్ రాయవరం ఏవోగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన ఏవోను పలువురు అభినందించారు.

'వాడపల్లి వెంకన్నపై దుష్ప్రచారం తగదు'

కొత్తపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంపై దుష్ప్రచారం తగదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్నారన్నారు. ఇటీవల కొందరు నకిలీలు ఈ ఆలయంపై దుష్ప్రచారంతో పాటు సామాజిక మాధ్యమాల్లో బురద జల్లుతున్నారన్నారు. భగవంతునిపై అవాకులు, చవాకులు పేలితే స్వామి ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఆలయ విశిష్టత, అభివృద్ధి ఓర్వలేక దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ఆయన అన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో

రాయవరంలో పొలం పిలుస్తోంది

రాయవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కేవీన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు ఈకేవైసీని ఈనెల 18లోపు పూర్తి చేసుకోవాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటకు విత్తనాలు ఎంపిక, నారుమడి యాజమాన్య పద్ధతులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు యాజమాన్యం చేపట్టాలన్నారు. పొలంగట్ల మీద కూరగాయలు సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ

అమలాపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో నెల రోజులపాటు కోచ్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 50 మందికి ఉచిత వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ నిర్వహించారు. మంగళవారం ముగింపు సందర్భంగా ఫిట్‌నెస్ జిమ్ లైఫ్ మెంబర్ జి.చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ ఆదిబాబు అతిథిగా హాజరయ్యారు.

వేడుకగా మంత్రి సుభాష్ జన్మదినం

• తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు • రక్తదానం, నేత్ర శిబిరాల నిర్వహణ

ద్రాక్షారామ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదిన వేడుకలు మంగళవారం వేడుకగా జరిగాయి. రామచంద్రపురం మండలం, పట్టణంలో మంత్రి జన్మదిన వేడుకలను అభిమానులు, కార్యకర్తలు నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి మంత్రి సుభాష్ నివాసంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆయన జన్మదిన వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఒబిళినేని లక్ష్మణరావు, వుండవిల్లి శివ, అల్లం శ్రీనివాస్, పలివెల రాజు అధిక సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం మంత్రి నివాసంలో ద్రాక్షారామ భీమేశ్వరాలయం అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందచేసి ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వెంకటాయపాలెంలో సాయి మాధవానంద ఫంక్షన్ హాలులో మంత్రి సుభాష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ గరగిపాటి సూర్యనారాయణమూర్తి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావుతో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టరు కడలి ఈశ్వరి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన వివిధ శాఖల అధికారులు మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పిలుపు మేరకు పేద కుటుంబాల దత్తత కార్యక్రమానికి పలువురు ఆర్థికతోడ్పాటు అందించారు. వికాస్ విద్యా సంస్థల అధినేత వాసంశెట్టి వెంకట రమణ రూ.లక్ష అందచేశారు. టీడీపీ నాయకుడు రావిపాటి గణేష్ చౌదరితో పాటు పలువురు పేద కుటుంబాల దత్తతకు ఆర్థికతోడ్పాటు అందించారు.



రామచంద్రపురంలో సోమవారం అర్ధరాత్రి కేక్ కట్ చేస్తున్న మంత్రి సుభాష్. పక్క చిత్రంలో మంత్రికి ఆశీర్వచనం అందజేస్తున్న భీమేశ్వరాలయ వేద పండితులు

రక్తదానం, నేత వైద్య శిబిరం: మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు, ఆయన అభిమానులు రక్తదానం చేశారు. దాతలకు రూ.లక్ష బీమా కల్పిస్తూ పత్రం అందచేశారు. ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పలువురికి నేత్ర పరీక్షలు జరిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): కార్మికశాఖా మంత్రి సుభాష్ పుట్టినరోజు వేడుకలను మండలంలో మంగళవారం నిర్వహించారు. కె.గంగవరంలో పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి పేరున ప్రత్యేక పూజలు చేయించారు. బాలాంత్రంలో మాజీ సర్పంచ్ ఈరెళ్ల రాజు ఉపాధి శ్రామికుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు.


కె.గంగవరం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు


అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రాకేష్ తదితరులు

అమరజీవి పొట్టి శ్రీరాములు బాట అనుసరణీయం

మండపేట, జూన్, 17(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు నేటి తరాలకు స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. దివంగత పొట్టి శ్రీరాములు 125వ జయంతిని ఏడాది పాటు నిర్వహించుకోవటం హర్షణీయమన్నారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సూర్య కన్వెన్షన్ హాలులో జరిగిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యేతో పాటు, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దుండి రాకాష్, శాసనమండలి డిప్యూటీ మాజీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్య నారాయణ, ఎంపీఐ శ్రీదేవి హాజరయ్యారు. ఎమ్మెల్యే వేగుళ్ల వైశ్య ప్రముఖుల చేతులు మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం శ్రీరాములు విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏడాది పొడవునా జయంతిని నిర్వహించేలా ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగపు ఉపాధ్యక్షుడు చుండ్రు శ్రీవరప్రకాష్, కోనసీమ జిల్లా ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు వాకచర్ల వీవీ వెంకట సత్యనారాయణగుప్తా, మద్దుల సుబ్బారావు, 17వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్య భవాని, జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

పేదలకు మేలు చేయడమే వికసిత్ భారత్ లక్ష్యం

ద్రాక్షారామ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పేదలకు మేలు చేయడమే వికసిత భారత్ లక్ష్యమని మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకురాలు ముళ్లపూడి రేణుక అన్నారు. మంగళవారం రామచంద్రపురం మండలం హసన్‌బాదలో వికసిత భారత్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, అనకాపల్లి పార్లమెంటు ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు తదితరులు మాట్లాడారు. అనంతరం బీజేపీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, వికసిత్ భారత్ ఇన్‌చార్జి సలాది వీరబాబు, చుండ్రు సాయిరాం భార్గవ్, జిల్లా ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ, డి.ఓం ప్రకాష్, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


హసన్‌బాదలో వికసిత్ భారత్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

క్వాలిటీ అసెస్మెంట్ సర్వే పరిశీలన

కపిలేశ్వరపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలోని కోరుమిల్లి 2, చినకోరుమిల్లి గ్రామంలో మంగళవారం ఎస్‌పీఎం శాఖ, జీజీహెచ్ కాకినాడ నుంచి వచ్చిన డాక్టర్ల బృందం క్వాలిటీ అసెస్మెంట్ సర్వేను పరిశీలించారు. ప్రొఫెసర్ డి.సుజాత ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం, జిల్లా నుంచి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమలత, ఎస్‌డీసీ సర్వేకు సంబంధించి పలు అంశాలను పరిశీలించారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్‌చౌదరి, గ్రామ సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ దీన్‌దయాల్ బిషప్, సూపర్‌వైజర్ కామేశ్వరరావు, ప్రశాంతి, దుర్గాదేవి తదితరులతో పాటు ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మండపేట, జూన్, 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో పలు వ్యాధులతో బాధపడి వైద్యం చేయించుకున్న వారికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం బాధితులకు అందజేశారు. ఈ మేరకు 36 మందికి మంజూరైన రూ.32,38,117లను పార్టీ కార్యాలయంలో బాధితులకు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాధితులతో పాటు ఆయా గ్రామాల కూటమినేతలు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం మండలం వెలిచేరులో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

ఆత్రేయపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో పి.వరప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు అందించామన్నారు. సెమిస్టర్ -1 పాఠ్య పుస్తకాలు 1550, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు 19250, డిషనరీలు 211 అందించామన్నారు. సెమిస్టర్-2 12950 పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వరలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, ప్రభుత్వం అందించే కిట్లు, బ్యాగ్‌లు అందించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలు ఉచితంగా అందిస్తుందని వీటిని విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని వరలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ సభ్యులు చల్లా బాబీ, ఉపాధ్యాయులు వాకా గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కట్లమ్మ తీర్థం


కట్లమ్మ అమ్మవారి గరగను ఊరేగిస్తున్న దృశ్యం

కొత్తపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అవిడి గ్రామ దేవత శ్రీ కట్లమ్మ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. అమ్మవారిని గ్రామస్థులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆదివారం చిన్నజాగరం, సోమవారం పెద్ద జాగరం నిర్వహించారు. తీర్థాన్ని పురస్కరించుకుని అమ్మవారి గరగలను గ్రామంలో ఊరేగించారు. ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈవో కామేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

రాయవరంలో పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం


కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

రాయవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాయవరం బేతేలు ప్రార్థన మందిరంలో పాస్టర్స్ ఫెలోషిప్ మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యకుడు సాల్మన్ రాజు మాట్లాడుతూ ఐక్యంగా ముందుకు సాగడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఫెల్లోషిప్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం పలు కమిటీలకు ఎంపికైన ఐ.ప్రభుదాస్, టి.లూథర్‌పాల్, ఎన్. ఫిలిప్, కె.సోమేశేఖర్, బి.సత్యదాస్, జి.అనిల్ కుమార్ తదితరులను ఫెలోషిప్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌బీబీ రాణి, సీహెచ్ సురేష్, ఫెల్లోషిప్ సభ్యులు పాల్గొన్నారు.